మర మనుషులు

బి. రాజేశ్వరి

"ఇంకా ముందుకు వెళ్ళటం అనవసరమని నా అభిప్రాయం! మనం కోరి కొరివితో తల గోక్కుంటున్నామని అనుమానం" అన్నాడు వినాయక్.

"ఇదిగో వచ్చేశాం! ఉత్తరంలో సూచించిన ప్రదేశం యిదే! అదిగో ఏటవాలు కొండ. ఆ కొండ శిఖరం ఎక్కి అవతలివైపుకు దిగగానే మనం చేరాల్సిన గమ్యం వస్తుంది. ఇదిగో, ఈ కాగితంలో సూచించిన గుర్తులు, ఏరో మార్కులు చూడు!" అన్నాడు రవీంద్ర.

వినాయక్ ఓసారి కాగితంలోకి తొంగిచూసి, "బ్రదరూ! నేనిక ముందుకు రాలేను. ఈ కొండలు, గుట్టలు అసలే ఎక్కలేను. అర్భకుడ్ని నన్నొదిలెయ్!" అన్నాడు.

రవీంద్ర కోపంగా చూశాడు.

"మరీ అంత సీరియస్‌గా చూడకు, భస్మమైపోతాను. నువ్వు కూడా నా మాట విని వెనక్కి వచ్చేసెయ్యి.

ఎవడో ముక్కు మొహం తెలీనివాడి ఉత్తరం చూసుకుని యెవరికీ చెప్పా పెట్టకుండా మనం ఇలా రాళ్ళపాలు కావటం నాకిష్టంలేదు. అనక మనకి ఏదయినా జరిగితే ఇంటికి కబురుచెప్పే దిక్కు కూడా లేదిక్కడ. చూశావా, అంతా నిర్మానుష్యంగా, భయంకరంగా వుంది!" వినాయక్ చుట్టూ ఓసారి కలియజూసి, భయంగా రవీంద్ర వంక చూశాడు.

రవీంద్ర ముఖంలో దృఢనిశ్చయం, పట్టుదల, సాధించాలనే దీక్షా ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. వినాయక్ మాటలు అతనిలో యెలాంటి చలనమూ పుట్టించలేక పోయాయి.

కాగితంలోకి పరిశీలనగా చూశాడు. బాణం గురు వేసినచోట కొండ ప్రాంతం గుర్తించబడివుంది. అక్కడ ఏటవాలుగా ఓ కొండ గుర్తించబడివుంది. కొండపైవరకు ఏవేవో పిచ్చిమొక్కలు అల్లుకు పోయినట్టు సూచించబడి వుంది.

"కొండ ఎక్కబోతున్నాను. ఇప్పుడే చెప్పెయ్యి నీ అభిప్రాయమేమిటో, సూటిగా!" అన్నాడు రవీంద్ర వినాయక్ ముఖంలోకి చూస్తూ గంభీరంగా.

"రవీ, నా మాట విను! ఇదేదో ప్రమాదకరమైన ప్రయత్నమని నాకనిపిస్తోంది. పోయి పోయి పులి నోట్లో తల దూర్చటంలాంటిది. అందుకే మన బలహీనత కనిపెట్టి వాదెవడో మనల్ని ఆటపట్టించడానికి అలా రాశాడు. మనం అది సీరియస్‌గా తీసుకుని ఈ కొండలు గుట్టలుపట్టి పోతున్నాం. ప్లీజ్, వెనక్కి పోదాం పద!"

"వినాయక్, నేనడిగింది, నువ్వు కొండ ఎక్కుతావా, లేక దిగివెళ్ళిపోతావా-అని! వెంటనే సమాధానం చెప్పు"

అన్నాడు రవీంద్ర నిర్మొగమాటంగా.

వినాయక్ రెండు నిమిషాలు తటపటాయించాడు. "ముందుకు వెళ్ళటం ప్రమాదకరమని నా మనస్సాక్షి హెచ్చరిస్తోంది. దయచేసి నా మాట విను. అంతకీ నీకు ఈ కొండెక్కాలని సరదాగా వుంటే మన క్లాస్ మేట్సు ఓ పదిమందిమి కలిసి ఎక్స్కర్షన్ కి మళ్ళీ వద్దాం. అప్పుడు ఈ కొండెక్కటం థ్రిల్లింగ్ గానూ వుంటుంది, నలుగురు వుంటే ధైర్యంగానూ వుంటుంది."

"ఓ. కే! నేను కొండ ఎక్కటానికే నిర్ణయించుకున్నాను. ఇదేదో తేల్చుకునేవరకు వెనక్కి రాను.నువ్వు యిక వెళ్ళొచ్చు!"

"రవీ. అంతేనా? నా మాట వినవా?"

"ఈ విషయంలో నేనెవరిమాటా వినదలుచుకోలేదు. నా మాట మన్నించి ఇంతదూరం వచ్చినందుకు నీకు కృతజ్ఞతలు. నువ్వు వెనక్కి పోయిం తర్వాత ఈ సంగతి ఎక్కడా చెప్పకు—ముఖ్యంగా మా ఇంట్లో! సాయంత్రం చీకటిపడేలోపల నేను తిరిగొచ్చేస్తాను."

వినాయక్ ఇబ్బందిగా చూశాడు.

రవీంద్ర అదేం పట్టించుకోకుండా చకచక కొండ యెక్కేస్తున్నాడు. వినాయక్ వున్న చోటనే నిల్చుండి చూస్తున్నాడు. రవీంద్ర యెంతో అనుభవజ్ఞుడిలా కొండ యెక్కుతున్నాడు.

వినాయక్ వెనుతిరగబోయి ఆగాడు. రవీంద్ర కొండ సగం ఎక్కాక ఆయాసం తీర్చుకోవటానికికన్నట్టు ఆగాడు. అక్కడినుంచి మరీ ఏటవాలుగా వుంది కొండ. అక్కడినుంచి జారిపోతే....? అమ్మో, ఇంకేమైనా

వుందా? కింద అన్నీ లోయలు, పెద్ద పెద్ద బండరాళ్ళు వున్నాయి. ఈ రవీంద్ర చాలా మొండివాడు. తీరి కూర్చుని ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటున్నాడు.

వినాయక్ ఆ రోజు సంఘటనని గుర్తుతెచ్చుకుంటున్నాడు.

ఉదయం పోస్టులో కాలేజి అడ్రసుకి రవీంద్ర పేర ఓ గమ్మత్తయిన ఉత్తరం వచ్చింది. అందులో రవీంద్రని ఉద్దేశించి, 'నీకో అద్భుతమైన, మరపురాని అనుభవం కావాలా? వెంటనే ఉరవకలి దేగల కొండకి వెళ్ళు. కొండ శిఖరం వరకు ప్రయాణంచేసి, అవలితట్టుకు దిగు! నీ వెన్నడూ ఊహించలేని గొప్ప అనుభూతిని పొందగలుగుతావు, ధైర్యముందా?' అని రాసివుంది.

అది రవీంద్ర తనని సవాల్ చేసునట్టు భావించుకున్నాడు. దానికింద దేగల కొండకిపోయే మార్గం, ఆ కొండ గుర్తులు బాణం గుర్తులువేసి చూపించబడ్డాయి.

రవీంద్ర తన దగ్గర ఏదీ దాచడు. వెంటనే ఉత్తరాన్ని తనకు చూపించాడు. అదేదో పిచ్చి ఉత్తరంలా కనిపించింది తనకు! అదెవడు రాశాడో విచరాలేం లేవు. ఊరికి నే అద్భుతం, అనుభవం—అంటూ ఏదేదో రాసి రవీంద్ర బుర్ర పాడుచేశాడు వాడెవడో! అది పట్టుకుని రవీంద్ర ఊహాల్లో తేలిపోతూ అప్పుడే మనోపథంలో దేగల కొండని దర్శించేస్తున్నాడు.

"ఇదెవడో, ఉబుసుపోకకు రాసినట్టుంది! దేగల కొండకి యెవరూ సాధారణంగా వెళ్ళరు. అది మనుషులు ఎక్కువగా తిరిగే ప్రాంతం కాదు. దాని గురించి రకరకాలుగా చెప్పుకుంటారు. వీడెవడో నిన్ను ఆటపట్టించటానికి రాసి వుంటాడు!"

"అయినా వెళ్దామా?" అన్నాడు రవీంద్ర ఉత్సాహంగా.

"నీకేమైనా మతిపోయిందా? కోరి ఆపదల్లో తల దూర్చటం దేనికి? ఆ రాసినవాడి పేరు, వూరు తెలీవు. వాడి ముక్కూ మొహం ఎరగం. అలాంటి అనామకు డెవడో రాసిన ఉత్తరాన్ని పట్టుకుని కొండలు, బండలు పట్టిపోవటం తెలివైన పనికాదు!"

"వాడెవడో మనకనవసరం, ఎందుకు రాశాడో, ఏమిటో చూడటానికైనా వెళ్ళివద్దాం. ఇప్పుడు పన్నెండు కావస్తోంది. సాయంత్రానికల్లా కాలేజి మూసే టైంకి మామూలుగా ఇంటికి తిరిగొచ్చెయ్యవచ్చు. ఏమంటావ్?"

"నన్నడిగితే లేనిపోని రిస్కు తీసుకోవటమంటాను."

"రిస్కు ఏముంది? సరదాగా ఓసారి పోయి చూసివద్దాం. అసలు దేగల కొండంటే మనవాళ్ళందరు యెందుకు భయపడతారో చూద్దాం. దాని సంగతి తెలుసుకుని నలుగురికీ చెపుదాం. అసలు అక్కడ ఏముందో యెవరికీ తెలియదుకదా! అందరూ ఊహాగానాలు అల్లి ఏవేవో కథలు చెపుతారు. అదేమిటో తెలుసుకునే అవకాశం మనకొచ్చిందిప్పుడు. పోదామా?"

"నా మాట విను రవీ, ఈ ఉత్తరం యెవడు రాశాడో, ఏమి ఆశించి రాశాడో తెలీదు. నీకే ఎందుకు రాశాడో అంతకన్నా తెలీదు. మన ఫ్రెండ్స్ సర్కిల్ లోనో, శత్రుకూటంలో వాడో ప్రాక్టికల్ జోక్‌గా రాసిందాన్నిబట్టి మనం ప్రొసీడ్ కావటం తెలివైన పని కాదు."

"మనకి శత్రువు లెవరున్నారు?"

"ఏం చెప్పగలం? మొన్న స్టూడెంట్సు యూనియన్ ఎలక్షన్సులో ప్రెసిడెంటు పదవికి నీతో పోటీచేసిన రఘు నీమీద కక్ తీర్చుకుంటాడు. వాడో, వాడి అనుచరులో ఇలా రాసి వుండొచ్చు! లేదా మన ఫ్రండ్స్‌లోనో యెవడో నీ తత్వం తెలిసి నిన్నో అట ఆడించటానికి ఇలా రాసి వుండొచ్చు. అద్భుతాలన్నా, సాహసాలన్నా నీకు అలవి మాలిన సరదా అని తెలిసిన వాడెవడైనా రాసి వుండొచ్చు."

"ఏదిఏమయినా మనం ఈ రోజు పోయి చూద్దాం."

"నీకంతగా చూడాలని వుంటే ఏ ఆదివారమో పెట్టుకుందాం. మనమిద్దరమే కాకుండా మన ఫ్రెండ్సు మరో నలుగుర్ని వెంటబెట్టుకుని వెళ్దాం. అప్పుడయితే ధైర్యంగా వుంటుంది. థ్రిల్లింగ్‌గానూ వుంటుంది. అప్పుడే అనుభవాలు, అద్భుతాలు యెదురవుతాయో చూద్దాం."

"ఆదివారం ఇంకా అయిదు రోజులుంది. నో, మనం యిప్పుడే వెళ్ళాలి."

"సరే, ఓ కండిషన్!"

"ఏమిటి?"

"కొండ యెక్కేలోపల చీకటిపడిపోతే వెనక్కి వచ్చేద్దాం. అనుమానాస్పద పరిస్థితులు యెదురైతే ముందే వెనక్కి వచ్చేద్దాం."

"సరే, పద!"

వినాయక్ ఆలోచనల్నుంచి తేరుకుని కొండ ఎక్కుతున్న రవీంద్రని గమనించాడు. రవీంద్ర కాలుజారి కిందికి తూలబోయాడు. రెండడుగులు జారి అక్కడే వున్న ఏదో పిచ్చిమొక్కని పట్టుకుని ఆపుకున్నాడు. లేకుంటే జరజర కిందివరకూ జారిపోయేవాడే!

వినాయక్ గుండె ఓ క్షణం ఆగి కొట్టుకుంది. అక్కడి నుంచి కిందపడిపోతే....? మరోసారి అనుకున్నాడు.

"రవీ, కిందికి వచ్చెయ్యి!" అని కేక వేశాడు.

రవీంద్ర వినిపించుకున్నాడో లేదో తెలీదు. వెనక్కి కూడా చూడకుండా కొండ ఎక్కుతూనే వున్నాడు.

మరోసారి ఎలుగెత్తి పిలిచాడు వినాయక్. రవీంద్ర ఎటూ తల తిప్పకుండా దీక్షగా పైకే ఎక్కుతున్నాడు. అక్కడినుంచి మరీ నిట్టనిలువుగా వుంది కొండ. మోకాళ్ళ మీద అనుకుని చేతులు కొండమీదున్న బండలని, పిచ్చి మొక్కల్నీ ఊతంగా తీసుకుని అలాగే మొండిగా ఎక్కుతూనే వున్నాడు రవీంద్ర.

వినాయక్ వాచీ చూసుకున్నాడు. సాయంత్రం నాలుగు గంటలవుతోంది. మరో గంటకో గంటన్నరకో చీకటి పడిపోతుంది. రవీంద్ర శిఖరాగ్రం చేరేసరికి చీకటి పడిపోతే, మళ్ళీ కిందికి ఎలా దిగగలడు?

చివరిసారిగా, మరోసారి, వెనక్కి రమ్మని అరిచి ఫలితం లేకపోవటంతో విధిలేక వెనుతిరిగాడు వినాయక్.

2

"మా బావగాని కనిపించాడా?" అనడిగాడు నాగు.

నాగు రవీంద్ర బావమరిది. మేనమామ కొడుకు.

వినాయక్ ఏం చెప్పాలో కొద్ది క్షణాలు తటపటాయించాడు. టైంచూడబోతే రాత్రి పదిగంటల సమయం.

"ఇంకా ఇంటికి రాలేదు. అక్క కనుక్కొని రమ్మంది" అన్నాడు నాగు.

అతని అక్క ఉజ్వల. కాబోయే రవీంద్ర భార్య. ఉమెన్స్ కాలేజిలో బిఎస్సీ ఫస్టియర్ చదువుతోంది. రవి ఫైనల్ బీకాం. ఈ వేసవిలో వాళ్ళిద్దరికీ

ముహూర్తాలు కూడా పెట్టుకున్నారు. రవీంద్ర మేన మామగారింట్లో వుండి చదువుకుంటున్నాడు.

వినాయక్ నిజం చెప్పటానికి సంకోచించాడు. తనేం చెప్పినా అది తనకే వ్యతిరేకంగా వుంటుంది. రవీంద్ర ఇంకా తిరిగి రాకపోవటంతో, అతను, తను దేగల కొండ వెళ్ళి తనొక్కడు వెనక్కి తిరిగిరావటంతో లేనిపోని అనుమానాలకు ఆస్కారం కల్పించిన వాడవుతాడు.

“కాలేజినుంచి ఇంకా రాలేదా, ఏదయినా సినిమాకు వెళ్ళాడేమో!”

“అక్కకు తప్పకుండా చెపుతాడు సినిమాకి వెళ్తే. కాని అలాంటిదేం చెప్పలేదు. మీకు తెలుస్తుంది, అడిగి రమ్మని పంపింది అక్క.”

ఉజ్వలకి తెలుసు—తను రవీంద్రకి బాగా క్లోజ్ అని! ఆమెకు తప్పుడు సమాచారం అందించనూ లేదు. నిజమూ చెప్పలేదు. తనమీద తనకే జాలేసింది వినాయక్ కు.

“నాకూ తెలీదు బాబూ!” అని చెప్పి నాగుని పంపించేశాడేగాని అతని అంతరాత్మ వినాయక్ ని నిలవనీయటం లేదు.

రవీంద్ర ఏమయిపోయాడు? ఏదయినా ఆపదలవలయంలో చిక్కుకున్నాడా? కొండ దిగబోతూ జారి పడిపోలేదుకదా! తను నిజంగా మిత్ర ద్రోహి! రవీంద్రని అతని ఖర్మానికి వదిలేసి స్వార్థం చూసుకుని వెనక్కి వచ్చేశాడు. మరి కాసేపు నచ్చచెపితే రవీంద్ర తన ప్రయత్నం విరమించుకునేవాడేమో!

ఉదయంవరకు రవీంద్ర రాకపోతే....? ఉదయం యెలాంటి వార్త వినాల్సివస్తుందో! రవీంద్ర మీదే అన్ని ఆశలూ పెట్టుకున్న ఉజ్వల, ఆమె తల్లిదండ్రులు, రవి

తల్లిదండ్రులు—ఏమయిపోతారు?

ఛీ, తనెంత మూర్ఖంగా ప్రవర్తించాడు! తననే నమ్మిన ప్రాణస్నేహితుడి నట్టేట్లో వదిలి వచ్చేశాడు. తనేం చేసినా పాపంలేదు!

ఆ రాత్రంతా వినాయక్ కంటిమీద కునుకులేదు. పక్కమీద అసహనంగా పొర్లుతూనే వున్నాడు. క్షణ క్షణం పక్కమీద లేచి కూచుని మళ్ళీ కొద్ది నిమిషాల తర్వాత పడుకుని, అలా తెల్లవారేవరకు గడిపేశాడు.

ఉదయం లేస్తూనే దేగల కొండ దగ్గరకు సరాసరి వెళ్ళిపోయాడు వినాయక్. గతరోజు రవీంద్ర ఎక్కిన కొండ దగ్గరికి చేరుకున్నాడు. ఓసారి కొండదిగువ బండ రాళ్ళ దగ్గర లోయలోను పరిశీలనగా చూశాడు. పొర పాటున రవీంద్ర దొర్లి పడిపోయాడేమోనని అతని అనుమానం!

తరవాత నెమ్మదిగా కొండ యెక్కటం ప్రారం భించాడు. కాళ్ళు పట్టు చిక్కక జారిపోతున్నాయి. కాళ్ళకు చెప్పులుంటే లాభంలేదని, వాటిని తీసి పారే శాడు. ఇప్పుడు పట్టు దొరుకుతూంది. కాలు జారటం లేదు. కొద్దిమేర యెక్కేసరికి ఆయాసం వచ్చింది. కొండ నిట్టనిలువుగా వున్నట్టనిపించింది. నీరసంగా వున్నట్టు తోచింది.

ఒళ్ళు తూలినట్టనిపించింది. చటుక్కున పక్కనే ఒత్తుగా పెరిగిన దుబ్బు మొక్కని పట్టుకుని నిలదొక్కు కున్నాడు. చుట్టూ దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు చిన్నా పెద్దా రాళ్ళు, రప్పలు, ముళ్ళపొదలు కూడా వున్నాయి. ఆ పొదలకి కాళ్ళు గీసుకుని రక్తం చిమ్మింది.

రవీంద్ర ఎలా ఎక్కగలిగాడో ఆ క్షణంలో అర్థం

కాలేదు వినాయక్‌కి. అలాగే మొండిగా ఎక్కసాగాడు. శిఖరాగ్రం చేరటానికి దాదాపు గంటపైగా పట్టింది.

శిఖరంమీదకుచేరి అవతలిపక్కకు ఆత్రంగా తొంగి చూసిన వినాయక్ ఆశ్చర్యానికి అంతులేదు!

ఇటుపక్కకు మల్లేనే ఆ పక్క కూడా కొండ ఏటవాలుగా నేలని తాకుతోంది. పిచ్చి మొక్కలు, రాళ్ళు, రప్పలు, పొదలు అన్నీ మామూలే! నేల తాకినచోట లోయ, పెద్ద పెద్ద బండరాళ్ళు అన్నీ వున్నాయి. లోయలోకి చూడటానికి కళ్ళు తిరిగాయి వినాయక్‌కి. తూలి పడబోయిన అనుభూతి.

నేలపైన ఎక్కడా ఎలాంటి సంచారమూ లేదు— మనుషులుగాని, జంతువులుగాని యెవరూ మసలుతున్న జాడలేదు. కనుచూపు మేరలో, అన్నీ కొండలే! బాట తీరి నున్నగా, నీలంగా వున్నట్టు కనిపిస్తున్నాయి. ఎక్కడా జనావాస ప్రాంతం కనపడటంలేదు.

వినాయక్‌కి ఎటూ పాలుపోలేదు. అసలు రవీంద్ర శిఖరాగ్రంనించి యీ పక్కకు దిగాడా? దిగితే, ఎక్కడికి వెళ్ళాడు.

వినాయక్ అటు పక్కకి దిగుదామా అనుకున్నాడు మొదట్లో. కాని ఆ పక్క ఆసక్తికరమైన అంశమేదీ కనిపించటంలేదు!

కొద్దిసేపు కర్తవ్యం తోచక అలాగే నిల్చుండిపోయాడు వినాయక్. అప్పటికి సూర్యుడు ఉదయించి చాలాసేపయింది. వెచ్చటి కిరణాలు అతనికి సూదుల్లా గుచ్చుకుంటున్నాయి. చెమట్లు పోసి వుక్కగా వున్న చల్లటిగాలి హాయిగొలుపుతోంది. తను సముద్ర మట్టానికి ఎంత ఎత్తులో నించునివున్నాడో ఆలోచిస్తున్నాడు

వినాయక్.

పది నిమిషాల తర్వాత కొండ దిగసాగాడు వినాయక్. ఎక్కినంత కష్టంగాలేదు దిగటం! ఓ అరగంట లోపలే దిగిపోయాడు.

ఓ పదినిమిషాలు అక్కడక్కడే తచ్చాడాడు. రవీంద్ర యేమయ్యాడు? గత సాయంత్రం కొండ దిగి వచ్చాడా? లేక దిగలేక యేమయినా అయ్యాడా? అతనికి ఎవరైనా కనిపించారా? ఏదైనా అనుభవం కలిగిందా? అయితే అదేమిటి? ఆ ఉత్తరంలోని విషయాలు నిజమేనా?

అన్నీ ప్రశ్నలే! జవాబులేని ప్రశ్నలు! జవాబు రాని ప్రశ్నలు!!

3

వినాయక్ యింటికి తిరిగొచ్చేసరికి, వాళ్ళింట్లోని వాళ్ళంతా ఒకరినొకరు వినాయక్ గురించి ఎంక్వయిరీ చేసుకుని ఎవరితోను యెక్కడికి వెళ్ళిందీ చెప్పలేదని తెలుసుకుని తర్జనభర్జనల్లో వున్నారు.

అప్పటికే రవీంద్ర గురించి రెండుసార్లు నాగు వచ్చి వెళ్ళాడు. అతను గత రాత్రంతా ఏమయిపోయాడో యెవరికీ తెలియటంలేదని చెప్పి, వినాయక్ గురించి అడిగిపోయాడు.

వినాయక్ రాగానే అతని తల్లిదండ్రులు అతన్ని ప్రశ్నల్లో ముంచెత్తి వదిలారు. వాళ్ళకి ఏదో చెప్పి తప్పించుకున్నాడు.

అప్పుడే నాగుని తీసుకుని ఉజ్వల వినాయక్ వాళ్ళింటికి వచ్చింది.

"మీరు నా దగ్గరేదో దాస్తున్నారు. రవి గురించి మీకు తెలుసు. రాత్రినుంచి నాకు ఒక్కక్షణం మన

శ్ాంతిలేదు. బావకేమయిందోనని ఒకటే హడలి చస్తున్నాను. మీకేమైనా తెలిస్తే చెప్పరా?" దీనంగా వుంది ఉజ్వల కంఠస్వరం. ఆమె రవీంద్రనెంతగా ఆరాధిస్తోందో, ప్రేమిస్తుందో ఆమె కంఠంలో ధ్వనించింది.

వినాయక్ కదిలిపోయాడు. ఉజ్వల ముఖంలోకి సూటిగా చూడలేకపోయాడు. ఇంకా పూర్తిగా పసితనం వదల్లేదు ఆమె ముఖంలో. అప్పుడే విచ్చిన గులాబీలా స్వచ్ఛంగా, స్నిగ్ధంగా వుంటుంది ఉజ్వల. నిండా పద్దెనిమిదేళ్ళు లేవు. బావ గురించి ఆమె చేస్తున్న ఎంక్వయిరీ ఎంతో అమాయకంగా చేలగా వుంది.

వినాయక్ పెదవి విప్పాడు. "రవీంద్ర యెక్కడికి వెళ్ళాడో నాకు తెలుసు. నేను ఇప్పుడు అక్కడికే పోయి వచ్చాను. అతను లేడు!" అన్నాడు.

ఒకేసారి వర్ణించలేని భావాలు కలగాపులగంగా ఉజ్వల మొహంలో దోబూచులాడాయి.

"ఎక్కడికి వెళ్ళాడు? ఎందుకని లేడు? చెప్పండి, బావకేదయినా ప్రమాదం జరగలేదుకదా!"

"ఏంలేదమ్మా! నువ్వనవసరంగా కంగారుపడకు. రవి యెంత చెప్పినా వినకుండా పంతానికి పోయాడు...." అంటూ నిన్న జరిగిన సంఘటనలు వరసగా చెప్పుకొచ్చాడు వినాయక్.

ఉజ్వల ఊపిరి బిగబట్టి విన్నది.

"అయితే, బావ ఏమయినట్టు? ఆ కొండ దిగటం మీరు చూడలేదా?"

"లేదు. శిఖరాగ్రం చేరేవరకు నాకు తెలుసు. నే నెంత బతిమాలినా తిరిగిరాలేదు. ఆ తర్వాత ఎటు దిగాడో, ఏమయ్యాడో తెలీదు."

"ఈ విషయం నిన్ననే మాకెందుకు చెప్పలేదు?"

"అందుకు నేను బాధపడని క్షణంలేదు. చెప్పి మీ అందరికీ మనోక్షోభ కలిగించటమేగాక, నన్ను అనుమానించే ప్రమాదం లేకపోలేదని గ్రహించాను. అందుకే చెప్పలేదు. తిరిగివచ్చేస్తాడనుకున్నాను. అందుకే తెల్లవారుండగానే, దేగల కొండకి వెళ్ళి చూశాను. అతనెక్కిన కొండ కూడా పైవరకు ఎలాగో ఎక్కి చూశాను. అతని జాడలేదు. ఒకవేళ రాత్రి మీ ఇంటికి తిరిగొచ్చాడేమో చూద్దామనుకున్నాను. కాని నేను వచ్చేసరికే నాగు రెండుసార్లు వచ్చి వెళ్లాడని తెలిసింది. సంగతి అర్థమైంది."

ఉజ్వల కళ్ళు జలపాతాలయ్యాయి. చెక్కిళ్ళమీదుగా కన్నీరు అలా స్రవిస్తూనే వుంది. తుడుచుకోవాలనే ప్రయత్నం కూడా చేయలేనట్టు అలాగే ప్రమాన్పడి వుండిపోయింది.

"అయామ్ సారీ ఉజ్వల, నన్ను క్షమించమ్మా!"

"నో, నో! మీ తప్పేంలేదు. బావ తత్వం నాకు తెలుసు. అతనికి అడ్వెంచర్స్ అంటే ప్రాణం! ఏదో సాధించాలనీ, ఎవరూ చేయని సాహసం చెయ్యాలని మాటల సందర్భంలో నాతో యెన్నోసార్లన్నాడు. ఎప్పుడూ నేల విడిచి సాముచేస్తుండేవి, అతని ఆలోచనలు. నేను ఎన్నోసార్లు ఎగతాళి పట్టించేదాన్ని! నువ్వేమయినా రాజకుమారుడివా లేక యుద్ధ వీరుడివా అని ఆటపట్టించేదాన్ని!

'చూస్తుండు, ఏదో నాడు ఎవరూ సాధించలేనిది సాధిస్తాను. గొప్ప పేరు సంపాదిస్తాను. అప్పుడుగాని ఈ రవిబావ గొప్పతనం నీకు తెలిసిరాదు!' అంటుండేవాడు.

ఆ ఉత్తరం చూడగానే బావలో నిద్రాణమైవున్న కోరిక — అదే గొప్ప కార్యమైనా సాధించాలనే కోరిక—పడగ విప్పిందన్నమాట! అందుకే మీమాట కూడా లక్ష్యపెట్టక తన పట్టుదలే సాధించుకున్నాడు."

ఉజ్వల మాటలు ఆసక్తిగా విన్నాడు వినాయక్— ఇదివరలో తన దగ్గర కూడా ఇలాగే ఏదేదో వల్లిస్తుండే వాడు రవీంద్ర! తను నవ్వి పూరుకునేవాడు. తను నవ్వి నప్పుడల్లా రవీంద్ర మొహం ఎర్రగా కందగడ్డలా అయ్యేది, అవమానంతో. 'చూస్తావుగా' అనేవాడు. కాని రవీంద్ర నరనరాన ఈ కోరిక జీర్ణించుకుని వున్నదన్నమాట. ఆ ఉత్తరం అతనిలోని కాంక్షను బాగా ప్రేరేపించింది. అందుకే ఇక రవీంద్ర ఆగలేదు.

"ఇప్పుడేం చేద్దామంటావు?" అన్నాడు వినాయక్.

"నేనో నిర్ణయానికొచ్చాను!" దృఢంగా వుంది ఉజ్వల స్వరం!"

"ఏమిటది?"

"తర్వాత చెప్తాను."

ఆ తర్వాత కొద్ది నిమిషాలకి ఆమె తమ్ముడితో కలిసి వెళ్ళిపోయింది.

వినాయక్ ఆ రోజు కాలేజికి పోలేదు. రవీంద్ర అంతర్ధానం విచిత్రంగా జరిగిపోయింది. అతని మెదడునిండా రవీంద్రని గురించిన ఆలోచనలే.

4

చటుక్కున మెలకువవచ్చింది రవీంద్రకి—జరిగినదంతా ఒకటొకటే గుర్తుకొస్తున్నాయి.

తను శిఖరం చివరికి చేరాడు. కిందినుంచి వినాయక్ పిలుస్తున్నాడు వచ్చెయ్యమని! తను వినిపించుకోనట్టు

కొండ ఎక్కుతూనే వున్నాడు. విసిగిపోయి వినాయక్ వెళ్ళిపోయాడు. తను కొండ అవలిపక్కకు తిరిగాడు. అది కూడా ఏటవాలుగా భూమ్మీదవరకు సాగిపోయి వుంది.

తన గుండె వేగంగా కొట్టుకుంటోంది. వుత్తరంలో రాసిన అంత అనుభవం — అద్భుతం — ఏ రూపంలో ఎదురవుతుందో అర్ధంకావటంలేదు. టెన్షన్ టెన్షన్ ఒకటే టెన్షన్!....తల సుత్తితో మోదినట్టు భారంగా వుంది.

తన కుడిపక్క అలికిడి అయితే చటుక్కున చూశాడు. కెవ్వున అరవబోయి విరమించుకున్నాడు. మనిషో, మృగమో తెలియని ఆకారం! ఒంటినిండా నల్లని రోమాలు! డ్రాయరు తప్ప ఒంటిమీద మరే ఆచ్చాదన లేదు. నల్లగా, పోతపోసిన కంచువిగ్రహంలా వున్నాడు! ఆరడుగుల ఆజానుబాహుడు! కనుగుడ్లు ఎర్రగా తాగిన వాడి కళ్ళలా వున్నాయి. రక్తిమ చిందిస్తున్నాయి. పెద్ద పెద్ద మీసాలు బలిష్టమైన కండరాలు. చిన్నసైజు రాక్షసుడిలా వున్నాడు.

"గుడ్! నువు చాలా ధైర్యవంతుడివి!" అన్నాడతను. తను కళ్ళు అప్పగించి అతనివంకే చూస్తున్నాడు.

అతను నవ్వాడు. నవ్వాడని తను అనుకున్నాడు. నవ్వు కూడా అంత భయంకరంగా వుంటుందని తనకి తెలీదు.

"నువ్వు ధైర్యవంతుడివని ఎందుకన్నానో తెలుసా? ఇదివరకు నీలాగే ఇద్దరు కుర్రాళ్ళు ఎంతో ధైర్యవంతుళ్ళలా కొండెక్కివచ్చారు. నన్ను చూసీ చూడగానే తారెత్తిపోయి గుండె ఆగి చచ్చిపోయారు. పాపం చాలా

లేత వయసు" మృగం సానుభూతి చూపిస్తోంది.

అప్పటికీ తను మాట్లాడలేదు.

"నీకేదో అద్భుతం చూపిస్తానని రాశాను కదూ వుత్తరంలో! చూస్తావా?" అన్నాడతను.

తను మౌనంగా తలూపాడు.

అతను చెయ్యి ముందుకు చాపాడు. అరచేతిలో కోడి గుడ్డుంది. గుప్పిట మూసి తెరిచాడు. ఈసారి అరచేతిలో అప్పుడే పొదగబడ్డ కోడిపిల్ల వుంది.

తను కళ్ళప్పగించి చూస్తున్నాడు.

అతను నవ్వి "అద్భుతంగా లేదూ?" అన్నాడు.

ఆ తర్వాత గాల్లో చేతినూపాడు. అరచేతిలో ఎర్రటి సింధూరం కనిపించింది. మళ్ళా గాల్లో ఊపి అరచేయి తెరిచాడు. చేతినిండా బంగారుకాసులున్నాయి.

తను ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"ఇది మేజిక్‌లా వుంది కదూ! ఇలాంటి చిన్న చిన్న ట్రిక్కులు మీ స్కూల్లోను, కాలేజీల్లోను మెజీషియన్స్ ప్రదర్శించి వుంటారు. అవునా?" అన్నాడతను.

అవునన్నట్టు తలూపాడు.

"మాట్లాడు. అలా తలూపితే ఏం తెలుస్తుంది? నేను నిన్నేం చెయ్యను. నీలాంటి తెలివైన ధైర్యవంతులైన పుత్రాళ్ళంటే నాకు చాలా సరదా, ఇష్టం! నేనేం రాక్షసుడ్ని కాదు, భయపడకు. కొద్దిగా భారీ శరీరం, అంతే!" అన్నాడు.

తనకు తెరుకుపోయి ఆ స్థానంలో ధైర్యం చోటుచేసుకుంటోంది.

"నీకిప్పుడో కొత్తరకం విద్య చూపిస్తాను. ఇలా నా కళ్ళలోకి చూడు!" అన్నాడతను.

తను చూశాడు. ఆ ఎర్రటి రక్తజీరలున్న కళ్ళలో ఏదో అలౌకిక శక్తి కనిపించింది తనకి. కళ్ళల్లో కళ్ళు పెట్టి చూడటానికే భయం వేసింది. ఆ కళ్ళలో ఏదో మంత్రశక్తి తన సర్వ శక్తుల్నీ లాగేసుకుంటున్నట్టు అనిపించింది.

కళ్ళు తిరిగాయి. ఒళ్ళు తూలింది.

అంతే తనకి గుర్తు! నేలమీద పడిపోబోతున్నట్టు ఎవరో పట్టుకుని ఆపినట్టు చివరిసారిగా గుర్తుంది.

ఇప్పుడు ఈ గదిలో తెలివొచ్చింది.

రవీంద్ర చుట్టూ పరీక్షగా చూశాడు. అదేదో గమ్మత్తయిన గది! యెక్కడినుంచో లోపలికి వెలుతురు పడుతున్నట్టుందిగాని, దారి కనిపించటంలేదు.

తనున్న ప్రదేశం యెక్కడుంది? తనని తీసుకొచ్చిన ఆ భయంకర వ్యక్తి ఎవరు? అతనేమయ్యాడు? తనని అతనే ఇక్కడికి తీసుకువచ్చాడా? అతని ఆకారం భయంకరంగా వున్నా మనిషి సౌమ్యుడిలానే వున్నాడు, తనతో ఆదరంగానే మాట్లాడాడు!

తనని ఎందుకు తీసుకొచ్చాడో తెలీదు. అసలు ఆ ఊతరం ఎందుకు రాశాడు? తననుంచి అతనికేం కావాలి?

"హల్లో యంగ్ మాన్, రాత్రి బాగా నిద్రపట్టిందా?" ఎక్కడినుంచో మాటలు వినిపించాయి. అవి అతని మాటలే! అయితే మనిషి కనిపించడే! ఆ మాటలు ఎక్కడినుంచి వినిపిస్తున్నాయో జాగ్రత్తగా గమనించాలి.

"బాగానే పట్టింది. అయితే యిప్పుడు పగలా, రాత్రా?" అడిగాడు రవీంద్ర.

"గుడ్, అలా ధైర్యంగా మాట్లాడాలి! ఇది పగలే. గత సాయంత్రం నువు నాతో మాట్లాడుతూనే మూర్ఛ

పోయావు. నా విడిదికి తీసుకొచ్చాను నిన్ను. రాత్రి మగతగా నేను పెట్టిన అన్నం తిని నిద్రపోయావు. బహుశా అన్నంతిన్న సంగతి కూడా నీకు గుర్తుండి వుండదు. అవునా?"

రవీంద్రకి నిజంగా నే గుర్తులేదు.

"ఇక్కడ నువ్వు చాలా ఫ్రీగా మసలవచ్చు. నీకు ఏం కావలసి వచ్చినా అడుగు. తిను, తిరుగు అంతేగాని పారిపోవాలని ప్రయత్నించకు."

"ఇంతకీ నన్నెందుకు తీసుకొచ్చావో చెప్పలేదు. నా గురించి మా వాళ్ళంతా కంగారుపడుతుంటారు. నేనేమై పోయానోనని బాధపడతారు. అయినా నన్నెందుకు బంధించావు? నేనేం అపకారం చేశాను నీకు?"

అతను నవ్వాడు. "నువ్వు నాకేమీ అపకారం చెయ్యలేదు. నేను కూడా నీకేమీ అపకారం చెయ్యను. నా వలన నీకు నీ వలన నాకు ఉపకారం జరగాల్సి వుంది. అంతా లోకకళ్యాణం కోసం! పరిస్థితులు త్వరలో నే నీకర్థమవుతాయి.

నీ కుడిపక్కన బాత్ రూం వుంది. కాలకృత్యాలు తీర్చుకో! స్నానంచేసి వచ్చేసరికి చక్కటి ఫలహారం సిద్ధంగా వుంటుంది. టిఫిన్ తిన్నాక నిన్ను బయటికి తీసుకువెళ్తాను. బైదిబై, ఇది నీకు బందిఖానా కాదు. రెండు రోజుల్లో అంతా నీకే అర్థమవుతుంది. ఓ.కే!?" అన్నాడు.

రవీంద్ర అనాసక్తంగానే లేచి బాత్ రూంవైపు వెళ్ళాడు. ఓ పావుగంట తర్వాత అతను స్నానంచేసి వచ్చేసరికి గదిలో టీపాయ్ మీద వేడిపొగలు విరజిమ్ముతూ కమ్మని వాసనలు వెదజల్లుతున్న జీడిపప్పు, ఉప్మా, ఎగ్

ఆమ్లెట్సు వున్నాయి.

వాటిని చూడగానే ఆకలి విజృంభించింది. అను మానాల్ని, ఆశ్చర్యాన్ని పక్కకి నెట్టి టిఫిన్ మీద విజృంభించాడు రవీంద్ర.

టిక్ మన్న చప్పుడు. వెను తిరిగి చూశాడు. ఓ గాజు గ్లాసునిండా పొగలు విరజిమ్ముతూ ఓవల్టిన్!

అవి తీసుకున్నాక రవీంద్రలో కొత్త ఉత్సాహం వచ్చింది. వెయ్యి ఏనుగుల బలంవచ్చినట్టనిపించింది.

"ఇంకో రెండు ఆమ్లెట్సు తింటావా?"

"వద్దు వద్దు. ఓవల్టిన్ కూడా తాగేశాను థాంక్స్."

"చూశావా, అప్పుడే నాకు కృతజ్ఞతలు కూడా చెప్పుతున్నావు. అంటే నామీద శత్రుత్వ భావంలేదన్న మాటేగా!"

"అలాంటిదేం లేదుగాని, నన్నిలా మోసంచేసి తీసు కొచ్చినందుకే కోపంగా వుంది."

"అన్యాయంగా మాట్లాడకు! నేను నిన్ను మోసం చేశానా? నువ్వే ఆసక్తితో బయలుదేరి వచ్చావు. నా మాటమీద వచ్చినందుకు నీకు సకల సౌకర్యాలు అమరుస్తున్నాను."

"అవుననుకో! కారణం చెప్పటంలేదుగా!"

"చెపుతాను. రెండు క్షణాలు కళ్ళుమూసుకో!"

"ఎందుకు?"

"నీకు బయటి ప్రపంచం చూపించబోతున్నాను."

"కళ్ళు మూసుకోకపోతే....?"

"డోన్ట్ బి సిల్లీ అండ్ చైల్డిష్! కళ్ళు పోతాయి."

రవీంద్ర చటుక్కున కళ్ళు మూసుకున్నాడు. మూసిన

ఆతని కళ్ళముందు మెరుపులు మెరిసినట్టనిపించింది.

"ఇప్పుడు కళ్ళు తెరవొచ్చు!"

రవీంద్ర కళ్ళు తెరిచి ముందుకు చూసి ఉలిక్కి పడ్డాడు.

5

ఆ రాత్రి యెలాగో కలత నిద్దురలో కాలక్షేపం చేసింది ఉజ్వల. ఆమె కళ్ళముందు చిరునవ్వుతో రవీంద్ర నిలబడివున్నాడు. రాత్రంతా ఆమె ఆలోచనలతో నే గడిపేసింది. తెల్లవారింది.

ఆ క్రితం రోజు వినాయక్ నుంచి వివరాలు సేకరించింది. దేగలకొండ వివరాలు, దాని నైసర్గిక స్వరూపం పరిసర ప్రాంతాల గురించిన సమాచారం మాటల సందర్భంగా తెలుసుకుంది.

ఉజ్వల లేచింది. చకచక తన కార్యక్రమాన్ని అమలులో పెట్టింది. నాగుని లేపి రహస్యంగా ఏదో చెప్పింది. నాగు భయం భయంగా చూశాడు అక్కకంక. వద్దంటూ తల అడ్డంగా తిప్పాడు. ఉజ్వల బతిమాలుకు నే ధోరణిలో ఏదో నచ్చచెప్పాక పూరుకున్నాడు.

పంజాబీ డ్రెస్సు వేసుకుంది. కాళ్ళకు బెల్టు జోళ్ళు వేసుకుంది. అప్పటికి ఇంట్లో ఇంకా ఎవరూ మేలుకో లేదు. నాగు తనూ వస్తానని మరాం చేశాడు. ఓ క్షణం ఆలోచించి ఒప్పుకుంది ఉజ్వల.

ఇద్దరూ దేగల కొండ చేరుకునేసరికి బాగా తెల్లవారిపోయింది. సూర్యుడు పొడుచుకొచ్చాడు. ఉదయ భానుడి కిరణాలు దేగల కొండమీద బంగారు వర్ణంలో ప్రతిఫలిస్తున్నాయి. కాని ఆ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించే స్థితిలో లేదు!

దేగల కొండ చుట్టుపక్కల నిర్మానుష్యంగా వుంది. కొండకి పాతిక గజాల దూరంలో ఓ సన్నటి తారు రోడ్డు వుంది. పల్లెటూళ్ళకి బస్ సౌకర్యం కల్పించటానికి కొత్తగా ఆ రోడ్డు నిర్మించారు. దేగల కొండ చుట్టుపట్ల వున్న గ్రామాల్ని కలుపుతూ పోతుందా రోడ్డు. పేరుకి రెండు బస్‌లున్నా ఒకటే కండిషన్‌లో వుంటుంది. అదే వచ్చి వెళ్తుంటుంది — దానిష్టమైనప్పుడల్లా.

దేగల కొండవైపు పరికించి చూసిన ఉజ్వలకు గుండె ఝల్లుమంది! సగంవరకు ఏటవాలుగా వున్న ఆ కొండ పైకి వెళ్ళేకొద్దీ నిట్టనిటారుగా వుంది — ఈ కొండ ఎక్కటం తనవల్ల అయ్యే పనేనా?

"అక్కా, ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"నాగూ, నువ్వు యింటికి వెళ్ళిపో!"

"అదేమిటి? నువ్వొక్కతివీ ఏం చేస్తావు?"

"బావ జాడ తెలుసుకుని వస్తాను."

"నేనుండటంవల్ల నీకొచ్చిన నష్టమేముంది? నేనూ నీతోపాటే వుంటాను."

"వద్దు చిన్నా! మనిద్దరమూ ఒకేసారి బయటికి వచ్చేస్తే అమ్మవాళ్ళు కంగారు పడిపోతారు. నువ్వు వాళ్ళకి ఏదయినా నచ్చచెప్పి సంగతి బయటికి రాకుండా చూడు!"

"అక్కా! నేను అబద్ధం చెప్పలేను. చెప్పినా మన వాళ్ళు నమ్మరు. అందుకని నీతోపాటే వుండి బావ జాడ కనుక్కుంటాను."

"సరే, అయితే నువ్వు కిందనే వుండు. నేను కొండ ఎక్కుతాను. నువ్వు ఎక్కలేవు" అన్నది ఉజ్వల బెట్టు జోళ్ళు సరిచేసుకుని కొండ యెక్కటానికి సంసిద్ధ

మవుతూ.

నాగు కింద నే వుండిపోయాడు.

ఉజ్వల కొండ యెక్కటం ప్రారంభించింది. చెప్పులు జారిపోతున్నాయి. బెల్టు వుండటం మూలాన కాలికి అంటి పెట్టుకుని మొత్తం కాలే జారిపోతోంది. అలాగే పట్టు బిగువున ఓపిక తెచ్చుకుని కొండెక్కుతోంది.

నాగు అక్కడవాకే దృష్టిసారించి చూస్తున్నాడు.

6

రవీంద్ర కళ్ళెదుట కనిపిస్తున్న దృశ్యాన్నే కళ్ళప్పగించి చూస్తున్నాడు.

అందరూ తన వయసువాళ్ళే — దాదాపు పాతిక ముప్పయిమంది కుర్రాళ్ళు వరసగా కూచునివున్నారు. అందరిలోను ఏదో వెలితి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

వీళ్ళందరు ఇక్కడ యెందుకున్నట్టు? వీళ్ళకు కూడా తనలాగే వుత్తరాలు రాసి రప్పించాడా ఈ మనిషి? వీళ్ళందర్నీ యేం చెయ్యబోతున్నాడు?

అక్కడ విశాలమైన హాలు—కాన్ఫరెన్స్ హాలులా వుంది. దానిచుట్టూ రోజ్‌వుడ్‌తో చేసిన ఖరీదైన కుర్చీలు. మధ్యలో డెకోలామ్ రౌండ్ టేబిలు, ప్రతిబింబం కనిపించేటంత స్మూత్ సర్ఫేస్‌తో ఆ హాలుకి నిండు చేకూరుస్తోంది.

కుర్చీల్లో యువకులంతా కూచుని వున్నారు. వాళ్ళ వెనుకగా గోడకి ఆనుకుని అక్కడొకడు అక్కడొకడు ఆ మనిషి తాలూకు మనుషులు చాలా ఎలర్టుగా కావలి కాస్తున్నారు. పైకి చూడటానికి చాలా స్వేచ్ఛగా వదిలేసినట్టు కనిపిస్తున్న ఆ కనబడని 'బందిఖానా' తెల్సుకుంటే నవ్వు వచ్చింది రవీంద్రకు.

చుట్టూ పరీక్షగా చూశాడు రవీంద్ర. కాన్ఫరెన్స్ హాలుకి కుడిపక్కన కొన్ని గదులున్నాయి. అన్నీ తాళాలు పెట్టి వున్నాయి. ఆ లోపల యేముందో?

అంతమంది మనుషులున్న జాడే లేదక్కడ! ఎక్కడి నుంచో చక్కటి వాద్యసంగీతం వినిపిస్తోంది—గోడల్లో అమర్చిన మైక్రోఫోన్లనుంచి, గాబోలు! హాలుకి ఎడమ పక్క విశాలమైన లాన్స్‌లో ఫ్రేముకుర్చీలు అర్థచంద్రాకారంగా వేసివున్నాయి.

రవీంద్ర అక్కడ కూచున్న యువకుల ముఖాల్లోకి చూశాడు. ఇదివరకెన్నడూ చూసిన ముఖాలు కాదు! ఎవరో వీళ్ళు? వాళ్ళ చూపుల్లో చూపులు కలపాలని చూశాడు. కాని యెవరూ అతనివంకే చూడటం లేదు. యేదో ఊహా లోకంలో విహరిస్తున్నట్టున్నారు. అర్థ నిమీలిత నేత్రాలతో యే వస్తువుమీదా కేంద్రీకరించని చూపులతో చాలా గమ్మత్తుగా కనిపిస్తున్నారు.

రవీంద్రకి వాళ్ళని చూస్తుంటే ప్రాణంతో వున్న మనుషులా, బొమ్మలా అన్న అనుమానం కలిగింది.

ఇంతలో తనకు పరిచయమైన ఆ రాక్షసాకృతిగల మనిషి అక్కడికి హుందాగా నడుచుకుంటూ వచ్చాడు. ఇప్పుడు అతన్ని చూస్తుంటే భయం వెయ్యటంలేదు. బహుశా అలవాటయిపోవటంవల్ల కావచ్చు. అయితే ఇప్పుడు ఫుల్ సూట్‌లో వున్నాడు. ఎలుగుబంటికి బట్టలు కట్టబెట్టినట్టు వికృతంగా వున్నా చాలా సౌమ్యంగా కనిపిస్తున్నాడు.

అతను కాన్ఫరెన్స్ గదిలోకి అడుగుపెడుతూనే "గుడ్ మార్నింగ్ మై డియర్ యంగ్ మెన్!" అంటూ అందరినీ వుద్దేశించి విష్ చేశాడు. అందరూ లేచి నిల్చు

న్నారు.

గదిలో వున్న ముప్పయిమందీ ఒకేసారి ముక్త కంఠాలు "గుడ్ మార్నింగ్ సర్!" అన్నారు మర్యాద వుట్టిపడుతుండగా.

అతను కూచుని అందర్నీ కూచోమని సైగ చేశాడు. అంతా కూచున్నాక "సురేష్!" అని పిలిచాడు అతను.

సన్నగా రివటలా వున్న ఓ యువకుడు లేచి అతని వైపు మంత్రముగ్ధుడిలా అడుగులు వేస్తూ వెళ్ళి ఒద్దికగా పక్కన నించున్నాడు.

"నీకు అప్పగించిన పని పూర్తికావచ్చిందనుకుంటాను" అన్నాడతను.

"అవును సార్! ఒక్క వారంరోజుల్లో పూర్తవుతుంది."

"గుడ్! వెళ్ళి నీ పని చూసుకో" అన్నాడతను.

సురేష్ వెళ్ళిపోయాడక్కడినుంచి.

"జైన్!" అని పిలిచాడతను.

లావుగా ఎర్రగా పొడవుగా చేయెత్తు యువకుడు ముందుకొచ్చాడు. సరాసరి అతని పక్కకువచ్చి నించున్నాడు.

"ఐ హోప్ యు ఆర్ ఇన్ ప్రోగ్రెస్!" అన్నాడతను.

"ఎస్సర్! ఐ విల్ బి సక్సీడెడ్ షార్ట్లీ!"

"వెరీగుడ్, కేరీ ఆన్!" అతని భుజం తట్టాడు అతను. జైన్ ఇంకా లావయిపోయేడు ఆ ప్రశంసతో.

"జార్జి" అంటూ మరొకతన్ని "సలీం!" అంటూ యింకో యువకుడ్ని పేరు పేరునా పిలిచి వాళ్ళ పని గురించి కనుక్కొని సంతృప్తిగా తలాడించాడతను.

గదంతా ఖాళీ అయిపోయింది.

గదిలోని తక్కిన ఎస్కార్టు మనుషులు కూడా వెళ్ళి పోయారు.

రవీంద్ర, అతను – యిద్దరే మిగిలారు.

"కమాన్ మై డియర్ యంగ్ మాన్! కమ్‌నియర్!" అన్నాడతను చల్లగా నవ్వుతూ.

అతని కంఠంలో యెక్కడలేని మార్దవమూ వచ్చింది. కమాండ్ వుంది. యేదో తెలీని ఆకర్షణ శక్తి వుంది.

రవీంద్ర అతనికి దగ్గరగా వెళ్ళాడు.

"నువ్వెవరో నాకు తెలుసు. నేనెవరో నీకు తెలీదు కదూ! నా పేరు ఆటం! వింతగా వుందికదూ. ఆటం అంటే అణువుకన్న సూక్ష్మాతిసూక్ష్మమైన అణువు. నేను అలాంటి సూక్ష్మాతిసూక్ష్మమైన వ్యక్తినన్నమాట! అయితే ఆ అణువే బాంబ్‌గా చెప్పుకుంటే నేను ఆటంబాంబ్‌ని. అవసరాన్నిబట్టి రూపాంతరం చెందుతుంటా న్నేను!" అతని వదనంలో అదే చిరునవ్వు. సమ్మోహనాస్త్రం లాంటి నవ్వు.

రవీంద్ర మౌనంగా అతన్నే చూస్తున్నాడు.

"వీళ్ళందరికీ నేను చిన్నచిన్న పనులు అప్పచెప్పాను. వీళ్ళందరూ చాలా తెలివైనవాళ్ళు! మేధావులన్నమాట! ఈ మేధావి వర్గంలో ఇప్పుడు నిన్ను చేర్చుకుంటున్నాను. అంటే నువు కూడా మేధావివే నన్నమాట! నీమీద కూడా విశ్వకల్యాణం కోసమై చిన్న కార్య భారం మోపుతున్నానన్నమాట! అది నువ్వు విజయవంతంగా పూర్తిచేస్తావనే నమ్మకం నాకుంది" ఆగాడు ఆటం.

రవీంద్ర అతని మాటలకు నాగస్వరంముందు తాచులా తలూపుతున్నాడు.

"నేను పూర్తికే పని చేయించుకోను. అందుకు ప్రతిఫలం చాలా భారీగానే ముట్టచెప్తాను. అంతేకాదు, నాకు వ్యతిరేకంగా పని చేసినా ప్రతిఫలం భారీగానే వుంటుంది. నువ్వంటూ ఈ భూమ్మీద మిగిలివుండవు" నవ్వుతున్నాడు ఆటం.

"ఇంతకీ నేను చెయ్యాల్సిన పనేమిటి?"

"చెప్తాను. ఇక్కడున్నంత కాలం నీ గురించి నీవాళ్ళ గురించీ అంతా మర్చిపోవాలి! నువ్వే ఆటంగా, ఆటమే నువ్వులా మారిపోవాలి. అదెలాగూ జరిగే దేననుకో, ఊరికే హెచ్చరిస్తున్నానంతే!"

రవీంద్ర ఆలోచిస్తున్నాడు.

"ఇలా నా కళ్ళలోకి చూడు!" ఆటం పిలిచాడు.

రవీంద్ర అతని కళ్ళలోకి చూశాడు. కొద్ది క్షణాలు మాత్రమే! ఆ కళ్ళలో ఏదో ఆకర్షణశక్తి! తన సర్వశక్తులూ లాగేసుకుంటున్న అనుభూతి!

"నువ్వు నేను చెప్పినట్టు వింటావు....వింటున్నావు" అన్నాడు ఆటం ఆగి ఆగి.

రవీంద్ర తలూపాడు.

"నీ పేరేమిటి?" ఆటం నెమ్మదిగా అడిగాడు. అతని స్వరంలో ఏదో రకమైన మెలోడి.

"ఏమో, నాకు తెలీదు...."

"నీకు పేరులేదు, అవునా?"

"అవును, లేదు!"

"నీ పేరు రవీంద్ర....కదూ!"

"అవును, నా పేరు రవీంద్ర!"

"గుడ్! ఇప్పుడు విను జాగ్రత్తగా! నువ్వు చెయ్యా

ల్సిన పనేమిటంటే...."

రవీంద్ర జాగ్రత్తగా వింటున్నాడు.

7

నాలుగైదుసార్లు జారిపోబోయి యెలాగో పట్టు చిక్కించుకుని, తుప్పలు పొదలు ఆధారంగా పట్టుకుని రేగల కొండ శిఖరాగ్రం చేరుకున్నది ఉజ్వల. పైనుంచి ఓసారి కిందికి చూసింది. కళ్ళు తిరిగాయి.

కింద నాగు చిన్న బొమ్మరాయిలా కనపడుతున్నాడు. ముఖంలోని భావాలేం కనబడటంలేదుగాని ఉజ్వల వూహించుకుంది—తమ్ముడు చాలా ఆత్రుతగా, టెన్షన్‌తో చూస్తున్నాడని ఆమెకు తెలుసు.

కొండమీదినుంచి అవతలిపక్కకు చూసింది.

దిగువన ఎక్కడో పాతాళంలో వున్నట్టున్న లోయ, పెద్ద పెద్ద బండరాళ్ళు—చాలా భయంకరమైన దృశ్యం! ఏమాత్రం కాలుజారినా రూపురేఖలు కనిపించకుండా పచ్చడికావలసిందే! ఒక్క క్షణం తొట్రుపడింది ఉజ్వల.

వినాయక్ చెప్పినట్టే వుందా కొండ! అవతలపక్కగాని, చుట్టుపక్కలగాని ఎక్కడా అనుమానించదగ్గ అంశమేదీ కనిపించటంలేదు. బావ మరి ఏమయిపోయినట్టు? యెలా మాయమయ్యాడు?

ఇంతవరకు రావటం వినాయక్ చూశాడు? కిందికి దిగటంగాని ఎవర్నయినా కలవటంగాని అతను చూడలేదు. తను అవతలి పక్కకు దిగిచూస్తే....? ఏమయినా కనిపిస్తుందేమో!

ఉజ్వలకి ధైర్యం సరిపోవటంలేదు. అంతదాకా సాహసించి రావటమే తన తలకు మించిన పని! ఇక్కడ తనేమైనా ప్రమాదంలో చిక్కితే....? నాగు చిన్న

పిల్లాడు. వాడు తనకి సాయం చెయ్యలేదు. వెంట వస్తే తీసుకొచ్చిందే గాని తనకి బాడీగార్డుగా కాదు.

నాగు వైపు చూసింది. వచ్చెయ్యమని చేయి వూపుతున్నాడు. భయపడిపోయినట్టుంది, ఇక వుండబట్టలేక పిలుస్తున్నాడు.

కాని ఉజ్వలకి కిందికి వెళ్ళాలనిపించలేదు. అవతలి పక్కకు దిగిచూడాలి! బావ ఎలా అంతర్ధానమయ్యాడో తెల్సుకోవాలి. అంతవరకు తను వెనుతిరిగి వెళ్ళేదిలేదు.

దృఢనిశ్చయంతో కొండ అవతలివైపుకు దిగసాగింది. తమ్ముడివైపు చూడలేదు. మళ్ళీ తన నిర్ణయం మారిపోవచ్చు! అప్పుడు తనొచ్చిన పని సఫలం కాకుండానే ఇంటికి వెళ్ళాల్సి వుంటుంది. అది తనకిష్టంలేదు.

కొండ అవతలివైపుకు దిగటానికి సులువుగానే వుంది. మెట్లు మెట్లుగా కొండ యెవరో చెక్కినట్టుంది. జారిపోకుండా దిగటానికి అనువుగా చేశారెవరో!

కొండ దిగుతూనే ఆమె నివ్వెరపడిపోయింది. గుండె వేగం హెచ్చింది. చేష్టలుడిగి నిల్చుండిపోయింది.

అక్కడ చిన్న చిన్న గోతులు తవ్వి వున్నాయి. అందులో అంతసేపు ఒదిగి దాక్కున్న నలుగురు వ్యక్తులు ఉజ్వలని చూడగానే చటుక్కున లేచి నిలుచున్నారు.

వాళ్లు బావ వయసువాళ్ళే! చదువుకునే కుర్రాళ్ళలాగే వున్నారు.

వాళ్ళు తనవంక నవ్వుతూ చూస్తున్నారు. మేకపిల్ల మీదికి ఉరకటానికి సిద్ధంగావున్న తోడేళ్ళలా వున్నాయి వాళ్ళ చూపులు.

ఆ నలుగురు కదిలి ముందుకు వస్తున్నారు.

అందులో ఒకడు చటుక్కున ఉజ్వల చెయ్యిపట్టు

కున్నాడు. ఆమె భయంతో అరిచింది.

నలుగురు కిసుక్కున నవ్వారు.

చెయ్యి పట్టుకున్న కుర్రాడు పకపక నవ్వాడు.

"ఎందుకు నవ్వుతారు? నా చెయ్యి వదులుమందు." జారిపోతున్న ధైర్యాన్ని కూడగట్టుకుంటూ దబాయించింది ఉజ్వల. చేయి విడిపించుకోబోయింది. పట్టు ఇంకా బిగిసిందే గాని సడలలేదు.

స్వతహాగా ఉజ్వల ధైర్యవంతురాలు. తెలివైనదీ. అయినా నలుగురు మగవాళ్ళని అలాంటి నిర్జన ప్రదేశంలో చూడగానే ఆమె ధైర్యం సడలిపోయింది. అయినా బింకంగా వుండటానికి ప్రయత్నిస్తోంది.

"ఎవరు మీరు? ఏమిటీ దౌర్జన్యం?" అరిచింది ఉజ్వల. అప్పటికి నలుగురు ఆమెను చుట్టుముట్టేశారు.

"మీరు దూరంగా వుండండి!" మొదటి కుర్రాడు తక్కిన వాళ్ళని చూసి మెల్లగా అన్నాడు. "మేమెవరమో చెప్పాలా? నన్నింకా గుర్తుపట్టలేదా? నీ బావ రవీంద్రతో కలిసి మీ యింటికి రెండుమూడుసార్లు వచ్చాను."

ఉజ్వలకి గుర్తొచ్చింది. అవును! వీడిని ఇదివరకు బావతో చూసింది. అయితే తర్వాత యెలక్షన్‌లలో వీళ్ళిద్దరు ప్రత్యర్థులుగా నిల్చున్నారు. ఆ తర్వాత బావ గెలిచాడు. వీడు బావతో కజ్జా పెట్టుకున్నాడు. గొడవలు జరిగాయి. బావ వీడి గురించి అప్పుడప్పుడు చెప్తుంటాడు.

ఉజ్వలకి అంతా వరసగా గుర్తొచ్చింది.

"హో, గుర్తుచ్చానని నీ ముఖమే చెపుతోంది. నీ బావ నాతో స్నేహంగా వుంటూ నామీదే దెబ్బతీశాడు. దెబ్బకుదెబ్బ తీయటానికి అవకాశంకోసం చూస్తున్నాను.

నీ బావతో వచ్చినప్పుడు నిన్ను చాలాసార్లు చూశాను. నీ అందానికి మూర్ఛపోయాను. నిన్నెలాగైనా నా వశం చేసుకోవాలని ఆనాడే నిర్ణయించుకున్నాను. అనుకోకుండా ఆశించని విధంగా ఈ రోజు చాలా అకస్మాత్తుగా అవకాశం దొరికింది.

మేం నలుగురం రోజూ ఉదయమే ఈ కొండవరకు రన్నింగ్ చేస్తుంటాం. ఈ రోజూ అలాగే రన్ చేస్తున్నాం. నువ్వు మీ తమ్ముడితో వస్తూ కనిపించావు. ఇంత ఉదయాన్నే ఇంతదూరం ఎందుకొస్తున్నావో తెలీదుగాని, మాకు చక్కటి అవకాశం కల్పించావు. నీకంటే ముందుగా ఇక్కడికి చేరుకున్నాం. నువ్వు కొండ దిగి రాకపోతే మేమే పైకి ఎక్కివచ్చి నిన్ను కిందిదింపేవాళ్ళం! మాకు శ్రమివ్వకుండా నువ్వే దిగొచ్చావు- దివినుంచి భువికి దిగివచ్చిన గంధర్వ కన్యలాగా!" అన్నాడతను.

ఉజ్వల కళ్ళు పెద్దవిచేసుకుని విన్నది అతను చెప్పిందంతా. వచ్చి వచ్చి ఈ వేటకుక్కలపాల బడిపోయానే అని విచారిస్తోంది. ఎలా తప్పించుకోవాలా అని మార్గాన్ని అన్వేషిస్తోంది.

ఆ కుర్రాడు వికృతంగా నవ్వుతూనే ఆమెని చటుక్కున కౌగలించుకున్నాడు. ఉజ్వల చటుక్కున తప్పించుకుని కిందికి జారిపోయింది. పరుగందుకుంది.

ఆ కుర్రాడు వుక్రోషంతో ఆమెని పట్టుకోవటానికి చేతిని విసిరాడు. ఆమె వల్లెవాటుగా వేసుకున్న కండువా చేతికి చిక్కింది. ఆమె మాత్రం చిక్కకుండా పరుగెడుతునే వుంది.

నాలుగు వేటకుక్కలు ఆమెని తరుముతున్నాయి.

8

"నువ్వు కుడిచేతిని ముందుకు చాపుతున్నావు.... ఆ రివాల్వర్ చేతికి తీసుకుంటున్నావు.... ఎదురుగా వున్న బోర్డుకి గురిచూస్తున్నావు...." ఆటం మెల్లమెల్లగా చెపుతున్నాడు.

రవీంద్ర మారు మాట్లాడకుండా అతను చెప్పినట్లల్లా చేస్తున్నాడు. కుడిచేతి లోనికి అక్కడి టేబిల్ మీదున్న రివాల్వర్ తీసుకున్నాడు. దూరంగా మైదానంలో నిల బెట్టివున్న చెక్కబోర్డుకి గురి చూశాడు.

"ట్రిగ్గర్ నొక్కుతున్నావు...." అన్నాడు ఆటం.

రవీంద్ర కుడిచేతి చూపుడువేలు సేఫ్టీకేచ్ ని తప్పించి ట్రిగ్గర్ మీద సుతారంగా నొక్కింది. తన ప్రమేయం లేకుండానే అంతా జరిగిపోతోంది. ఇదివరలో తను రివాల్వర్ యెన్నడూ ముట్టలేదు. షూట్ చెయ్యలేదు. గన్ షూటింగ్ మాత్రం తెలుసు. ఎన్. సి. సి.లో నేర్పారు.

అసంకల్పితంగా తనిలా ప్రవర్తిస్తున్న విషయంకూడా అతని మనసుకి తాకటంలేదు. అతని చేతులు మెదడు యిచ్చే ఆజ్ఞల ప్రకారం పనిచేస్తున్నాయి. ఆ మెదడును పనిచేయిస్తున్న వ్యక్తి వేరే. అతను ఆటం.

బుల్లెట్ సరాసరిపోయి టార్గెట్ ని తాకింది. సర్ మంటూ గాలిని కోసిన చప్పుడు! బుల్లెట్ రివాల్వర్ నించి వెలువడినప్పుడు వచ్చిన అదురుకు కొంచెం జంకాడు రవీంద్ర! అయినా అది తాత్కాలికం! మళ్ళీ అతని మెదడు ఆటం స్వరానికి అనుగుణంగా పనిచేస్తూనేవుంది.

గుండు టార్గెట్ ని తాకగానే చప్పట్లు కొట్టాడు ఆటం.

"గుడ్, వెరీ గుడ్! నువ్వు నాకు నచ్చావు. ఇది ఈ రోజు మొదటి పాఠం. రెండో పాఠం రేపు చెపుతాను. నువ్వు హాయిగా రెస్టుతీసుకో! మధ్యాహ్నం భోజనం గదిలో సిద్ధంగా వుంటుంది. భోంచేసి సుఖంగా నిద్రపో!" అన్నాడు ఆటం.

ఆటం స్వరంలో చెప్పుకోదగ్గ మార్పు కనబడుతోంది రవీంద్రకు. ఇంత సేపు ఆజ్ఞలు జారీచేసిన కంఠానికి యీ కంఠానికి భేదం కన్పిస్తోంది. ఇంతవరకు అతని స్వరంలో ఆదేశకమైన అధికారయుతమైన కమాండ్ వుంది. ఫ్రీక్వెన్సీ వుంది. ఇప్పుడు అతిమామూలుగా మార్దవంతో నిండి, అభిమానంతో తొణికిసలాడుతోంది.

రవీంద్ర అరనిమీలిత నేత్రాలు మామూలుగా విచ్చుకున్నాయి. అంతక్రితం తనేం చేసిందీ ఎంత ప్రయత్నించినా గుర్తురావటంలేదు.

ఆటం చెప్పినట్లే అతను చూపించిన దిశకు నడిచి గదిలో ప్రవేశించాడు. ఇప్పుడు గదికి తలుపులున్నాయి. పైన గోడలో అమర్చిన వెంటిలేటర్సున్నాయి. వాటిలోంచి సూర్యకిరణాలు సూటిగా గదిలో పడుతున్నాయి.

మధ్యాహ్న మార్తాండుడు నిప్పులు చెరుగుతున్నాడు.

9

ఉజ్వల ఆయాసంతో రొప్పుతూంది. అయినా పరుగెత్తటం మానలేదు.

ఒక దశలో ఆమె వాళ్ళకు దొరికిపోయేదే! కానీ, ఆమెని ఒడిసి పట్టుకోబోయిన కుర్రాడు ఓ బండరాయికి కాలు కొట్టుకుని అమాంతం ముందుకు విరుచుకు పడిపోయాడు. వాడిని పరామర్శించటానికి తక్కిన ముగ్గురు ఆగారు.

ఆ కొద్ది క్షణాలని ప్రాణ మాన రక్షణకు చాలా చురుగ్గా ఉపయోగించుకుంది ఉజ్వల. కొండకి ఆ పక్కగా మరుగ్గా వున్న ప్రదేశంలో తలదాచుకుంది. అక్కడినుంచి చూస్తే మైదానంలో కొండ పరిసరాల ప్రాంతమంతా కనిపిస్తోంది. బయటివాళ్ళకు మాత్రం తను కనపడే అవకాశం లేదు. అక్కడే నిలబడి బండకు చేరగిలబడి అలుపు తీర్చుకో సాగింది.

గుండె దడ కొంచెం తగ్గింది. అక్కడినుంచి వేట కుక్కల్ని తొంగిచూసింది. కిందపడ్డవాడికి చాలా పెద్ద దెబ్బ తగిలింది. లేవలేకపోతున్నాడు. వాడికి తక్కిన వాళ్ళు సాయంపట్టి పక్కగా కూచోబెడుతున్నారు.

ఇంకా సేపటికి వాళ్ళంతా ఆ కొండ ప్రాంతమంతా ప్రతి సెంటిమీటరూ వెతికి తన అంతు చూసేస్తారు. అది చెప్పుకోదగ్గ సురక్షిత స్థలంకాదు! కాసేపటికో! గడియకో వాళ్ళ చేతిలో చిక్కక తప్పదు.

ఉజ్వల మెదడు చాలా వేగంగా పని చేస్తోంది.

వాళ్లు దెబ్బతిన్న కుర్రాడ్ని వదిలి పైకి లేచారు. డేగ చూపులు చుట్టూ సారిస్తున్నారు. ఇంకా సేపట్లో తన ఉనికి తెలుసుకుంటారు. తనని సర్వనాశనం చేసేస్తారు. ఈలోపలే తను ప్రాణం తీసుకోవాలి. అంతకన్న గత్యంతరం లేదు!

ఆమెకు చటుక్కున అనుమానం వచ్చింది — తన బావని వీళ్ళే ఏమైనా చేశారేమో! రవీంద్ర జలహీనత వీళ్ళకు తెలుసు. వుత్తరం వీళ్ళే రాసి అతన్ని యీ కొండ దగ్గరకు వచ్చేలా ఏర్పాటు చేసి, చాటున దాక్కుని బావ రాగానే ఈ లోయల్లోకి నెట్టేసివుంటారు!

ఈ ఆలోచన రాగానే ఆమె గుండె ఓ క్షణం ఆగి,

మళ్ళీ విపరీతంగా కొట్టుకోసాగింది! అదే జరిగుంటుంది. తనకోసం వాళ్ళు గోతుల్లో గుంటనక్కల్లా నక్కి-దాక్కున్న సంఘటన గుర్తుకు తెచ్చుకుంది.

దారి లేకపోయాక తను బతికినా చచ్చినా ఒకటే! ఈ దుర్మార్గుల చేతుల్లో అవమానంపొంది చచ్చేకంటే ముందుగానే ఆత్మహత్య చేసుకు చావటం మేలు!

ఉజ్వల అటు ఇటు చూసింది. వాళ్ళు ఇటే వస్తున్నారు! పక్కగా లోయలు, బండరాళ్ళు. ఒక్క గంతు వేస్తే చాలు, ఈ జీవితంనించి శాశ్వతంగా పరిష్కారం లభిస్తుంది!

ఉజ్వల బండపక్కనుంచి లోయలవైపు నడిచింది. ఆమె చేయి అనుకోకుండా బండమీద ఓ స్థలంమీద తగిలింది. అప్పుడో అద్భుతం జరిగిపోయింది.

అంతవరకు తను చేరబడివున్న బండ, బండమాత్రమే కాదని, అదో రహస్య సొరంగానికి తలుపులా వుపయోగపడిందనీ, దానికో స్విచ్ లాంటి మీట అమర్చబడివుందనీ, తను అనుకోకుండా దాన్ని నొక్కాననీ ఆమె గ్రహించేలోపలే ఆమె ద్వారం లోపల్నుంచి తూలి పడిపోవటం, బండనున్న రహస్య ద్వారం తిరిగి మూసుకుపోవటం చాలా వేగంగా జరిగిపోయింది.

10

సాయంత్రం కావటం, చీకటిపడటం, రాత్రి భోజనం అకస్మాత్తుగా గదిలోని టేబిల్ మీద ప్రత్యక్షంకావటం అన్నీ ఓ క్రమ పద్ధతిలో జరిగిపోతూనే వున్నాయి.

రవీంద్ర ఆటం గురించే ఆలోచిస్తూ భోంచేస్తున్నాడు. ఆటం తనని ఇక్కడికి తీసుకొచ్చిన కారణం తనకి ఇప్పటికీ అర్థంకాలేదు—అయితే అతనికి తనతో ఏదో ముఖ్యమైన

పనే వుంది. తనలాంటి తక్కిన ముప్పయిమందితోను అలాంటి పనులే ఏవో వున్నాయి. అయితే ఏమిటా పని?

ఆటం అతిథి మర్యాదల్లో చాలా భారీగానే ఏర్పాట్లు చేస్తున్నాడు—చక్కటి విందు భోజనాలు, పానీయాలు, మాంసాహార భక్ష్యాలు — చాలా ఘనంగానే పంపిస్తున్నాడు.

అవి సుష్టుగా తిని తనకు మత్తుగా నిద్రపట్టేస్తోంది. కాలం యెలా గడుస్తోందో కూడా తెలియటంలేదు. తను ఇక్కడికొచ్చి చాలా రోజులయిపోయినట్టుంది. కాని నిజానికి నిన్న మధ్యాహ్నమే తను దేగలకొండ వినాయక్‌తో వచ్చాడు. ఇక్కడ ఓ రాత్రి, మరో పగలు గడిచిపోయాయి. ఇది రెండో రాత్రి.

రవీంద్ర మనసు కాసేపు మామయ్య వాళ్ళింట్లోని మనుషుల గురించి, ముఖ్యంగా ఉజ్వల గురించి ఆలోచిస్తోంది. తన అంతర్ధానం గురించి వాళ్ళంతా ఏం ఆందోళన పడుతున్నారో....? ముఖ్యంగా తనని చూడకుండా కొన్ని గంటలు కాలేజీలో గడపటానికే మహా యిబ్బంది పడిపోయే ఉజ్వల దాదాపు రెండు రోజులు ఎలా గడిపిందో? తనేమయిపోయాడనుకుంటున్నారో?"

వినాయక్ ఉజ్వలతో నిజం చెప్పి వుంటాడా? బహుశా చెప్పడు! తనతో వాడున్నట్టు అందరికీ తెలిస్తే అందరూ వినాయక్ తనని యేమో చేశాడని అనుమానించే ప్రమాదముంది. అందుకే చెప్పడు.

అతను చెప్పకపోతే ఉజ్వలకుగాని, మామయ్య వాళ్ళకుగాని తన ఉనికి తెలియదు. తనని ఇక్కడినుంచి తప్పించేవాళ్ళెవరూ వుండరు. ఆటం దయతలచి తనని

వదిలిపెట్టేవరకు తనని రక్షించే దిక్కులేదు! ఈ ఆటం తనని అంత సులువుగా వదిలిపెడతాడా? ఏమో, చెప్పటం కష్టం!

ఆలోచనల్లోనే భోజనం పూర్తయింది.

రవీంద్ర పక్కమీద నడుం వాల్చాడు.

"మై డియర్ యంగ్ మాన్!" ఆటం కంఠం ఎక్కడి నుంచో వినిపించింది. ఉలిక్కిపడి లేచికూచున్నాడు రవీంద్ర—

"యస్సార్!" అన్నాడు యాంత్రికంగా.

"సుఖంగా నిద్రపో! రేపు ఉదయం రెండో పాఠం మొదలు పెడతానన్నానుకదా! అందుకు నీకు ఇప్పటినుంచీ పూర్తి విశ్రాంతి అవసరం....గుడ్ నైట్!" అని వినిపించింది ఆటం కంఠస్వరం.

రవీంద్ర కొద్ది నిమిషాల్లోనే గాఢంగా నిద్రపోయాడు.

తెల్లవారింది. మళ్ళీ ఏర్పాట్లన్నీ మామూలే!

అతను టిఫిన్ కార్యక్రమం ముగించుకునేసరికి ఆటోమాటిక్‌గా తలుపులు తెరుచుకున్నాయి. రవీంద్ర లేచి బయటికి వచ్చాడు.

ఎదురుగా కాన్ఫరెన్స్ హాలు. అప్పటికే ఒకరొకరు అక్కడికి చేరి కూచుంటున్నారు టేబిల్ దగ్గర కుర్చీల్లో.

ఆటం రావటం ఒకరొకర్ని వాళ్ళకి అప్పగించిన పనుల గురించి వివరణ అడగటం, వాళ్ళు ఉచితరీతిన సమాధానం చెప్పి వెళ్ళిపోవటం, తనొక్కడే గదిలో మిగలటం అన్నీ నిన్నటిమాదిరిగానే జరిగిపోయాయి.

రవీంద్ర ప్రేక్షకుడిలా చూస్తూ ఉండిపోయాడు. అసలు వాళ్ళకి అప్పగించబడ్డ పనులేమిటో, వాళ్ళు ఏం సాధించామని చెపుతున్నారో ఏమీ అర్థంకాలేదు.

బహుశా వాళ్ళలో రెండోవాడి కూడా తక్కిన వాడు యేం పని చేస్తున్నాడో తెలీదేమో! అలాగేవుంది వాళ్ళ ప్రవర్తన! ఒకరితో ఒకరు మాట్లాడుకోవటంగాని, పలకరించుకోవటం గాని యేమీ లేదు. కీ యిస్తే వచ్చి పనులు చేసి పోయే మర బొమ్మల్లా పని చేస్తున్నారు వాళ్ళు.

ఆటం రవీంద్ర ఆలోచనల్ని కనిపెట్టినట్టు నవ్వాడు.

"నువ్వేం ఆలోచిస్తున్నావో నాకు తెలుసు. వీళ్ళు యేం పనులు చేస్తున్నారని కదూ నీ అనుమానం! త్వరలోనే అన్ని సంగతులూ నీకు అర్థమవుతాయి. ఈ లోపల నీ పాఠాలు పూర్తికావాలి కదా! ఇవాళ రెండో పాఠం చెపుతా నన్నాను కదూ, సిద్ధంగా వున్నావా?" అన్నాడు ఆటం.

"ఎస్సర్!" అన్నాడు రవీంద్ర. అతని గొంతు అతనికే వింతగా ధ్వనిస్తున్నట్టనిపించింది.

"అయితే శ్రద్ధగా విను...." అన్నాడు ఆటం.

రవీంద్ర వింటున్నాడు.

11

కాసేపటివరకు తానెక్కడుందో గుర్తు తెలీలేదు ఉజ్వలకు. కళ్ళు చీకటికి అలవాటు పడ్డాక కొద్ది కొద్దిగా కనిపించసాగింది, లోపల యేదో సొరంగంలాగా వుంది. ఎక్కడినుంచో సన్నటి వెల్తురు పడుతోంది.

ఉజ్వల లేచి నిల్చుంది.

ఓ ప్రమాదంలోంచి మరో ప్రమాదంలో యిరుక్కున్నట్టనిపించింది.

ఉజ్వల నెమ్మదిగా వెలుగు వస్తున్నవైపు అడుగులు వేస్తోంది. గుండె దిటవుపరచుకొంది. తాత్కాలికంగా ఆ

దుర్మార్గుల బారి నుండి తప్పినందుకు రిలీఫ్‌గా వుంది. ఇక్కడి పరిస్థితులు తనకు వ్యతిరేకంగా పరిణమిస్తే ఆత్మ త్యాగం చేసుకోవటానికి తను సిద్ధంగానే వుంది!

ఉజ్వలకు ఎక్కడలేని మొండిధైర్యం వచ్చేసింది. అడుగులు మరుగ్గా ముందుకు పడ్డాయి.

ఒక యిరుకు గది. అది గదికాదు. పొడవైన నడవా. వరండాలా వున్న ఆ నడవాలో గుడ్డి వెలుతురు పడు తోంది. ఆ వెలుతురులో ఉజ్వల తేలిగ్గానే నడవగలుగు తోంది.

ఆ నడవాలో గదుల వెనుక భాగాలు కనిపిస్తు న్నాయి. వెనుకపక్కన గాలి రావటానికి పెట్టిన వెంటి లేటర్లు బయటకి కనిపిస్తున్నాయి. ఆమె తలకి సమాంత రంగా వున్న వెంటిలేటర్స్ నుంచి లోపలికి తొంగి చూసింది. సరిగా కనిపించలేదు. కాళ్ళపై నిక్కి చూసింది. లోపలి దృశ్యం ఆమెకి యేమీ అర్థంకాలేదు. ఎవడో పిచ్చివాడు చేస్తున్న చేష్టల్లా కనిపించా యామెకు.

లోపల ఓ యిరవయ్యేళ్ళ లోపు యువకుడు గదిలో అటు యిటు పచార్లు చేస్తున్నాడు. కాసేపు ముందుకి కాసేపు పక్కకి, మరోసారి వెనకకి నడుస్తున్నాడు. చేతుల్లో గాల్లో ఏదో విసురుతున్నాడు.

చేతుల్లో యేమీ లేదు. ఏదో అస్పష్టంగా ఉచ్ఛరిస్తు న్నాడు.

ఎక్కడినుంచో గదిలోకి మాటలు వినిపిస్తున్నాయి. ఆ మాటల్ని ఆ కుర్రాడి చేష్టలకి అన్వయించుకుంది. అప్పుడు ఆ కుర్రాడి చేష్టలు అర్థవంతంగా కనిపించాయి. ఆ మాటల్నిబట్టే ఆ కుర్రాడు ప్రవర్తిస్తున్నాడు. అయితే

ఆ మాటలు యెక్కడి నుంచి వస్తున్నాయి. ఆమెకి ఎంత ఆలోచించినా అంతుబట్టలేదు.

ఆ తర్వాత మరి కాస్త ముందుకి సాగింది. మరో గది లోంచి యేవో కేకలు వినిపిస్తున్నాయి. ఆసక్తిగా తొంగి చూసింది. లోపల ఓ యువకుడు మరబొమ్మలా గుండ్రంగా తిరుగుతున్నాడు. అతని చేతిలో యేదో ఆయుధం వుంది. దానితో తన యెదురుగా వున్న గడ్డిబొమ్మను ఎన్నిసార్లో పొడుస్తున్నాడు ఆదేపనిగా.

ఇక్కడ కూడా గోడ లోపల్నుంచి ఏవో మాటలు వినిపిస్తున్నాయి. ఆగమంటే ఆగుతున్నాడు. పొడవమంటే పొడుస్తున్నాడు. ఆ మాటలకి అనుగుణంగానే ప్రవర్తిస్తున్నాడు.

ఉజ్వలకు కొంచెం అర్థమయింది విషయం. ఎవరో వ్యక్తి వీళ్ళకు ఆజ్ఞలు జారీ చేస్తున్నాడు. ఆ ఆజ్ఞలని ఈ వర్రాళ్ళు అక్షరాలా అమలుజరుపుతోన్నారు. చూడగా యీ రెండు గదుల్లోనూ వినిపించిన స్వరం ఒకేలాగా వుంది. ఒకే వ్యక్తి ఏకకాలంలో యిద్దరికీ ఆజ్ఞలు జారీ చేస్తున్నాడా?

ఉజ్వల సాలోచనగా అడుగులు ముందుకు వేసింది. ఈ అడవిలో భూగృహం, భూగృహంలో వ్యక్తులు వింతగా తోచింది ఆమెకు.

ఆ నడవా చాలా పొడువుగా వుంది. బయిటికి చాలా వెంటిలేటర్సు కనిపిస్తున్నాయి. అంటే అన్ని గదులు నడవాపొడువుకీ వున్నాయా....? యేమో, చూడాలి— అనుకుంది.

మూడో గది వెంటిలేటరు నించి లోపలికి తొంగి చూసింది. తక్కిన రెండింటి కన్న యిది కొంత భిన్నంగా

కనిపించిందామెకు.

గదిలో ఓ యువకుడు ఓ టేబిల్ ముందు కూచుని వున్నాడు. అతని చేతిలో కొన్ని వైర్లు, పనిముట్లు వున్నాయి. వాటితో టేబిల్ మీదున్న ఓ మరబొమ్మకు ఏదో రిపేరు చేస్తున్నాడు. మరబొమ్మ తల భాగంలో ఆ వైర్లు కలిపి, వైర్లని కరెంటు ప్లగ్ పిన్నుకి కనెక్టు చేస్తున్నాడు. టేబిల్ మీదున్న ఓ పరికరంలో సన్నటి మెరుపులు ఎగుడు దిగుడుగా పయనిస్తూ సన్నటి ధ్వని తరంగాన్ని ప్రసారం చేస్తున్నాయి. ఈ గదిలో కూడా మాటలు వినిపిస్తున్నాయి—తక్కిన గదుల్లో లాగానే. ఆ మాటల్ని ఫక్తు అనుసరిస్తూ పని చేసుకుపోతున్నాడా యువకుడు.

ఆ తర్వాతి గదుల్లో కూడా ఆమెకు యెన్నో వింత దృశ్యాలు కనిపించాయి. ఓ యువకుడు రివాల్వర్ని గురి చూసి కాలుస్తున్నాడు. రివాల్వర్ నుండి గుళ్ళు రావటం లేదు. సన్నటి నిప్పురవ్వలు వస్తున్నాయి. అలాగే మరో గదిలో యింకో యువకుడు పెద్ద పెద్ద బౌండు పుస్తకాల్ని ముందేసుకుని వాటిలో నుండి యేవో విషయాలు వేరే పుస్తకంమీద కాపీ చేస్తున్నాడు.

ఇంకో యువకుడు కాళ్ళు పైకెత్తి తలమీద శీర్షాసనం వేసినట్టు ఆసనం వేసి తలతో నడుస్తున్నాడు. మరో యువకుడు కాన్వాసుమీద రంగులు పులిమి వింత వింత బొమ్మలు సృష్టిస్తున్నాడు. ఆ తర్వాత గది ఖాళీగా వుంది.

ఉజ్వల కిదంతా చూస్తూంటే ఏదో పిచ్చివాళ్ళ లోకంలో తిరుగుతున్నట్టనిపించింది. అయితే ఆమె గమనించిన విషయమేమంటే, ప్రతిగదిలోను ఒక్కో యువకు

డున్నాడు. అందరూ దాదాపు పద్ధెనిమిదీ-యిరవయి ఏళ్ళ మధ్య యువకులే! అందరూ గోడలలోపల్నుంచి విని పిస్తున్న ఆజ్ఞల ప్రకారం పని చేస్తున్నారు.

అయితే అన్ని గదుల్లోనూ ఒకేసారి ఆ మాటలు ఎలా వినిపిస్తున్నాయి? ఆ మాటల తాలూకు మనిషి ఒక్కడే! ఒకే వ్యక్తి ఏక కాలంలో యింతమందికి ఆజ్ఞలు యెలా జారీ చేస్తున్నాడు? ఒక నిర్ణీతమయిన స్థలంలో మైక్రోఫోన్ల ద్వారా ఆజ్ఞలు పంపటాని కవకాశముంది. కాని, అవన్నీ ఏకకాలంలో వినిపించటం కష్టం! ఒకర తర్వాత ఒకరికి ఆజ్ఞలు పంపవచ్చు. కానీ ఒకేసారి అందరికీ....

ఉజ్వలకి సమస్య విడిపోయింది. ఈ ఆజ్ఞలు జారీ చేస్తున్న వ్యక్తి ఒకడే. సందేహంలేదు. అయితే ఏక కాలంలో ఆజ్ఞలు పంపడంలేదు. ఒకేసారి రికార్డు చేసి, ఆ రికార్డుని ప్రతి గదిలోను మైక్రోఫోన్లో వినిపించటానికి యేర్పాటు చేసివుంటాడు.

ఉజ్వల తన విజ్ఞానశాస్త్ర పరిజ్ఞానికి తనని తను మెచ్చు కుంది. అదే అయివుంటుంది. ఆ ఆజ్ఞలు బహుశా టేప్ చేసి అన్ని గదులకి అన్ని టేప్ రికార్డర్ల మీద ప్లే చేస్తున్నాడు. ఆ ఆజ్ఞలకి బద్ధులై ఆ యువకులు ప్రవర్తిస్తున్నారు.

అంటే, తన స్వరానికి వాళ్ళు కట్టుబడేటట్టు చేస్తున్నాడు. అంటే వాళ్ళ మెదడుని తన కంఠస్వరంలోని ఫ్రీక్వెన్సీ అనువుగా మార్చుకుంటున్నాడన్నమాట.

అదెలా సాధ్యం?

ఉజ్వల మెదడు చాలా చురుకుగా పనిచేస్తోంది. వారంరోజుల క్రితం తను చూసిన ఓ ప్రొఫెసర్ గారి హిప్నాటిజం ప్రదర్శన గుర్తొచ్చింది. అందులో ఆ ప్రొఫె

సర్ కొంతమందిని హిప్నటైజ్ చేసి, వాళ్ళను తనకు అనుకూలంగా మార్చుకుని, తను చెప్పినట్లు వాళ్లు అనుసరించేలా చేశాడు. అదీ కొద్ది నిమిషాలే! చాలా వినోదాత్మకమైన ప్రదర్శన! ఎంతో విజ్ఞానదాయకంగా గడిచింది.

హిప్నాటిజం ద్వారా ఎన్నో మంచిపనులు సాధించవచ్చునని, కొన్ని దీర్ఘవ్యాధుల్ని నయంచేయవచ్చుననీ చెప్పి ప్రొఫెసర్ తన షో ముగించాడు.

అయితే, ఈ యువకులందర్నీ యెవరో హిప్నటైజ్ చేస్తున్నారన్నమాట! ఏమాశించి చేస్తున్నట్టు? ఎవరో లోక వినాశానికి ఈ యువకుల్ని తర్ఫీదిచ్చి నియోగించబోవటంలేదుకదా—అనిపించిందామెకు. తను చూసిన వాళ్ళంతా చాలా భయంకరమైన పనులు చేస్తున్నారు. నిస్సందేహంగా ఇదేదో వినాశకరమైన శక్తుల పనే అయుండాలి!

ఆమె అనుమానం మరికొద్ది క్షణాల్లోనే నివృత్తి అయిపోయింది. ఆమె చివరిగా చూసిన గది చాలా పెద్దది. ఎన్నో వెంటిలేటర్స్ అమర్చబడివున్న పెద్ద హాలు. హాల్లోకి తొంగిచూసిన ఉజ్వల కళ్ళు చెదిరిపోయాయి. గుండె వేగం హెచ్చింది.

లోపల చాలామంది సైంటిస్టులున్నారు. లెక్కపెట్టలేనన్ని టేబిల్స్. వాటిమీద రకరకాల ఏసిడ్స్, బీకర్లు, గంటజాడీలు, పరీక్షనాళికలు, రసాయనాలు వున్నాయి. వాటిముందు కూచుని ప్రయోగాలు చేస్తున్నారు ఆ సైంటిస్టులు.

అయితే లోపల చాలా ప్రశాంతంగా వుంది. సూది కిందపడితే వినిపించేటంత నిశ్శబ్దంగా వుంది. ఎవరిమటుక

వాళ్ళు తమ ప్రయోగాలు మౌనంగా యాంత్రికంగా చేసుకుంటూ పోతున్నారు. వారి పనులు చూడటానికి సిద్ధంగా కొంతమంది పక్కన నిల్చుని వున్నారు.

ఓ పక్కగా గోడలకు పేర్చిన ఏవో బేళ్ళు లాగా వున్నాయి. వాటిమీద 'ఎక్స్‌ప్లోజివ్స్' అని ఇంగ్లీషులో రాయబడివుంది. అంటే అవన్నీ ప్రేలుడు పదార్థాలో అయితే ఆ ప్రయోగశాలలో తయారవుతున్నవన్నీ ప్రేలుడు పదార్థాలా. అంటే బాంబులా?

ఆ విషయం తెల్సుకోగానే ఉజ్వల గుండె లయ తప్పింది. ఎంత ఘోరం! ఊరి చివరగా కొండలో వున్న ఈ రహస్య స్థావరంలో పెద్ద ఎత్తున మందుగుండు సామాను రహస్యంగా తయారవుతోంది. ఓ పక్క అన్నం పున్నెం ఎరగని యువకులు హిప్నటైజ్ చేయబడి భయంకర పనులు కోసం తర్ఫీదివ్వబడుతున్నారు.

ఇదంతా చేయిస్తున్న దెవరు? స్వదేశీయులా, విదేశీయులా?

ఉజ్వల రక్తం సలసల మరిగింది. ఆమె నరనరాన మాతృదేశంమీది భక్తి మమకారం పొంగి పొరలింది. ఈ నరరూప రాక్షసుల ఆట కట్టించాలి! వెంటనే వెనక్కి పోయి ఈ సంగతి పోలీసులకి ప్రభుత్వానికి తెలియ చెయ్యాలి! ఈ రాక్షసుల ప్రయత్నాల్ని భంగం చెయ్యాలి!

ఉజ్వలకి ఆ క్షణంలో తన బావ విషయంగాని, తనక్కడికి ఎలా వచ్చిందన్న విషయంగాని, ఆ విషవలయంలో నుంచి యెలా తప్పించుకోగలనని గాని—ఇవేవీ మనసుకి తోచలేదు. దేశ సమస్యముందు తన స్వంత సమస్య ఏ పాటిది—అనిపించిందామెకు.

అయితే ఆమె అనుకున్నట్టు జరగలేదు. ఆమె వెంటి లేటరునించి తొంగిచూడటం ఓ కావలివాడు కనిపెట్టే కాడు. యెందుకో తల పైకెత్తిన వాడిచూపులకి ఉజ్వల విశాల నేత్రాలు కన్పించాయి.

"ఎవరది?" అని అరిచాడు.

ఒక్కసారిగా ఆ నిశ్శబ్ద వాతావరణంలో చిన్న కల కలం చెలరేగి పెద్దదయింది.

ఉజ్వల యేమాత్రం ఆలస్యం చెయ్యకుండా వచ్చిన తోవనే నడకలో వెనక్కి పరుగెడుతూ వాళ్ళకి కని పించకుండా తప్పించుకోవాలని ప్రయత్నించింది. కాని నడవా చాలా పొడవుగా వుంది. ఆమె ప్రయత్నం ఫలించేలోపలే వెనకనుంచి యెందరో వ్యక్తులు పరు గెడుతూ వచ్చి ఆమెని పట్టుకున్నారు.

12

"ఇలా నా కళ్ళల్లోకి చూడు యేం కనిపిస్తుంది?" అడిగాడు ఆటం.

"ఏమీ కనిపించటంలేదు" అన్నాడు రవీంద్ర.

"ఇంకా దీక్షగా చూడు. తెల్లగుడ్డు కన్పించటం లేదూ?"

"లేదు!"

"నల్ల పాప!"

"లేదు."

"ఎర్ర జీర?"

"ఉహుఁ!"

"వెరీగుడ్! ఇంకా దీక్షగా చూడు."

"ఏవో పర్వతాలు, లోతైన సముద్రాలు కనిపి స్తున్నాయి. యేవో హోరు వినిపిస్తోంది."

"సక్సెస్! నిన్ను...." అని ఆటం ఏదో అనేలోపల నలుగురు వ్యక్తులు ఉజ్వలని పెడరెక్కలు విరిచి తెచ్చి అతని ముందుంచారు.

ఆటం నివ్వెరపోయి చూశాడు.

రవీంద్ర చూపులు నిశ్చలంగా వున్నాయి. ఎటో చూస్తున్నాయి. అక్కడ ఆటం, తను తప్ప మరెవరూ అతని దృష్టికి అందటంలేదు.

"ఎవరీ పిల్ల? ఇక్కడికెలా రాగలిగింది?" హుంకరించాడు.

"ఏమో! బాస్! మన ప్రయోగశాల దగ్గర లోపలికి తొంగిచూస్తుంటే పట్టుకుని తెచ్చాం."

"ఏయ్, ఎవరు నువ్వు?" ఆటం ఉజ్వలకి అతి సమీపంగా వచ్చి గుడ్లురిమాడు.

అప్పుడు చూసింది ఉజ్వల రవీంద్రను.

"బావా!" అని అరిచింది పిచ్చి ఆనందంతో.

రవీంద్ర ఉలకలేదు, ప ల క లే దు. మరబొమ్మలా నిల్చుండి శూన్యంలోకి చూస్తున్నాడు.

ఆటంకి కొంత అర్థమయింది, కొంత అర్థంకాలేదు.

"బావా! బావా!" మళ్ళీ మళ్ళీ పిలుస్తూ రవీంద్రని కుదుపుతోంది ఉజ్వల.

రవీంద్రలో చలనంలేదు.

ఆటంకి అనుమానం రేకెత్తింది. ఈ పిల్ల రవీంద్ర అనబడే ఈ కుర్రాడి మరదలా? ఇక్కడికెలా వచ్చింది?

రవీంద్ర దగ్గరగా వచ్చాడు.

"చూడు, నా కళ్ళలోకి మరోసారి చూడు. నల్ల పాప కనిపిస్తోంది. అవునా?" అన్నాడు ఆటం.

రవీంద్ర తలూపి, "అవును, కనిపిస్తోంది."

"తెల్ల పాప?"

"ఊఁ! అది కూడా."

"ఎర్ర జీరలు?"

"కనిపిస్తున్నాయి."

"నీ పేరు?"

"రవీంద్ర!"

"గుడ్! ఈ పిల్ల యెవరో చూడు!"

రవీంద్ర అప్పుడే ఈ లోకంలోకి వచ్చినట్టు చుట్టూ చూసి, "అఁ! ఉజ్వలా? నువ్వా? ఇక్కడికెలా వచ్చావు?" అన్నాడు.

ఉజ్వల ఏదో చెప్పేలోపల ఆటం అందుకుని, "ఎలా వస్తుంది? నువ్వే ఇక్కడికొస్తూ నీ మరదలితో చెప్పి వుంటావు. నువ్వు వెంటనే తిరిగిరాకపోతే నీ మరదల్ని వచ్చి ఈ ప్రాంతాల వెతకమని చెప్పివుంటావు. నువ్వు రాకపోవటంతో వెతుక్కుంటూ వచ్చింది. బహుశా నీతోనే తెచ్చి దూరంగా వుంచావు. మా సౌధరం చూసి వెనక్కి వెళ్ళిపోయింది. ఈ రోజు వచ్చింది" అన్నాడు.

రవీంద్ర పిచ్చిగా అరిచాడు! "నో, నేనెవరికీ చెప్పలేదు. ఓ స్నేహితుడితో కలిసి వచ్చాను. కాని వాడు, నేను దేగలకొండ యెక్కేముందే వెనక్కి వెళ్ళిపోయాడు. ఈ సౌధరం చూసే అవకాశం అతనికిలేదు."

"అయితే యీ రివాల్వర్ తో ఈమెని కాల్చి చంపెయ్యి!" అన్నాడు ఆటం రివాల్వర్ రవీంద్ర చేతికిచ్చి.

రవీంద్ర నివ్వెరపోయి చూశాడు. కావాలంటే అతనే చంపెయ్యవచ్చుకదా, రివాల్వర్ తనకెందుకిస్తున్నట్టు?

"నువ్వు నిజంగా ఆమెకు ఏ విషయమూ చెప్పివుండక

పోతే నిస్సంకోచంగా ఆమెని కాల్చెయ్య్!" ఆటం మళ్ళీ చెప్పాడు.

రవీంద్ర నిస్సహాయంగా చూస్తోన్నాడు. ఉజ్వల బావకంకే కళ్ళార్పకుండా చూస్తోంది.

ఆటం రవీంద్ర దగ్గరగా వచ్చాడు. అతని కళ్ళలోకి సూటిగా చూశాడు. "రివాల్వర్ అందుకో!" అన్నాడు.

రవీంద్ర రివాల్వర్ అందుకున్నాడు.

"గురిపెట్టు!"

రవీంద్ర అతను చెప్పినట్టే చేస్తున్నాడు. సేఫ్టీ కాచ్ తప్పించి ట్రిగ్గర్ మీద వేలు పెట్టాడు.

ఉజ్వల చాలా చురుగ్గా పనిచేసింది. ఒక్కసారిగా బోర్లా నేలమీద పడిపోయింది. రివాల్వర్ గుండు వెనక నించున్న ఓ అనుచరుడి భుజంలోనించి దూసుకుపోయింది.

ఉజ్వల అనుచరుడి చేతిలోనించి రివాల్వర్ అందుకుని ఆటంకి గురిపెట్టింది—

"ఫ్రెండ్స్! ముందు బావని నీ హిప్నటిజంనించి విడుదల చెయ్యి" ఆజ్ఞాపించింది ఉజ్వల.

తక్కిన అనుచరులు కదలబోతే "నిర్దాక్షిణ్యంగా మీ బాస్‌ని కాల్చేస్తాను. ఎవరూ కదలొద్దు" అన్నది ఉజ్వల.

ఆటం చేతులు పైకెత్తి రవీంద్ర ముందుకొచ్చి అతన్ని హిప్నటిజంనించి రిలీజ్ చేశాడు.

రవీంద్ర తన చేతిలోని రివాల్వర్ గట్టిగా పట్టుకున్నాడు. అతని చెయ్యి వొణుకుతోంది. హిప్నటైజ్ చెయ్యడానికి ముందున్న ధైర్యం ఇప్పుడు లేదు. అయినా ఉజ్వలని చూసిన ఆనందంలో అతనికి వెయ్యి ఏనుగుల

బలం వచ్చింది.

ఈలోపల మరి కొంతమంది అనుచరులు అక్కడికి వచ్చి కలిశారు. వాళ్ళ చేతుల్లో గన్స్ వున్నాయి.

అయితే పరిస్థితి గమనించిన ఉజ్వల, రవీంద్ర ఆటంని కవర్ చేసేశా రప్పటికే! తన స్వశక్తి మీద, తన ఆటం బాంబులమీద, హిప్నటిజంమీద విపరీతమైన నమ్మకమున్న ఆటం, ఆయుధం చేతలేకుండా నిర్లక్ష్యంగా నిలబడిపోయి నందుకు తననితాను చాలాసార్లు నిందించుకున్నాడు ఆ దురదృష్ట క్షణంలో.

"ఎవరైనా పిచ్చివేషాలు వేస్తే నిరాక్షిణ్యంగా మీ బాస్‌ని కాల్చేస్తాం" అన్నాడు రవీంద్ర ఆటం అనుచరుల్ని ఉద్దేశించి.

"ఆటం! వాళ్ళందర్నీ ఆయుధాలు కింద పెట్టమను. ఎక్కడికీ కదలొద్దని చెప్పు. నీ సావరమంతా మాటల మయం. నీ మనుషులు మాటల జోలికిపోతే నీ గుండె రెండుగా చీల్చిపారేస్తాం. మాకెటూ ప్రాణాలమీద ఆశలేదు" అన్నాడు రవీంద్ర.

ఆటం ఆదేశాల ప్రకారం అనుచరులంతా నేలమీద ఆయుధాలు పారేసి చేతులు పైకెత్తేశారు.

ఆటం ఏ మాత్రం అవకాశం దొరికినా రవీంద్రని, ఉజ్వలని హిప్నటైజ్ చేద్దామని ప్రయత్నించాడుగాని వాళ్ళిద్దరు పొరపాటున కూడా అతని కళ్ళలో కళ్ళు కలపలేదు.

"బావా! నువ్వు ఇక్కడే ఈ మహానుభావుడ్ని కవర్ చెయ్యి. రెండు నిమిషాల్లో వస్తాను!" అన్నది ఉజ్వల.

ఆ మాటలు చెపుతూనే ఆమె తనుచూసిన యువకుల గదుల దగ్గరకు పరుగులుపెట్టి తలుపులు తట్టింది. లోపల

టేప్ వినిపించటంలేదు.

టకటక తలుపులు తెరుచుకున్నాయి. యువకులంతా బయటికొచ్చి వింతగా చూస్తున్నారు. ఇప్పుడు వాళ్ళ మీద ఆటం హిప్నటిజం పనిచెయ్యటంలేదని గ్రహించింది ఉజ్వల.

"అందరూ తప్పించుకుని పారిపోండి. అదిగో ఆ దారి వెంట!" అని వాళ్ళకు దారి చూపించి, లాబరేటరీవైపు పరుగెత్తింది ఉజ్వల.

యువకులు హాల్లోకి పరుగెత్తుకుని వెళ్ళారు.

ఉజ్వల ప్రయోగశాలలోని సైంటిస్టుల్నికూడా ఆటం మాయంచేసి తెచ్చాడని గ్రహించింది. ప్రయోగశాలలోని సైంటిస్టులందర్నీ హెచ్చరించింది. బయటికి పారిపొమ్మంది. వాళ్ళందరూ లేచి పరుగులు పెట్టారు.

ఉజ్వల ప్రయోగశాలలోని 'ఎక్స్ప్లోజివ్స్'అని వున్న పార్సిల్సుని గురిచూసి కాల్చబోయి, అంతలోనే నాలిక్కొరుచుకుని, ఓ పొడవాటి తాడుని భాస్వరంలోముంచి దాని చివరని ఆ పార్సిల్సుకి కలిపింది. అటు యిటు చూసింది. వెలుగుతున్న ఓ స్పిరిటు లాంపు కనిపించింది. దాంతో తాడు ఈ చివర అంటించింది.

భాస్వరంలో తడిసిన తాడు చిరచిరమంటూ కాల్తూ పోసాగింది. ఓ అయిదు నిమిషాల్లో అది మందుగుండు సామానుకి తాకుతుందని ఆమెకు తెలుసు!

ఉజ్వల తిరిగి హాల్లోకి వచ్చేసరికి, అప్పటికే యువకులు, శాస్త్రజ్ఞులు అక్కడ గుంపుగా చేరారు. తలోకరూ తలో ఆయుధమూ చేతచిక్కించుకున్నారు.

"బయటికి దారి చూపించు!" అన్నాడు రవీంద్ర ఆటం నుద్దేశించి.

ఆటం మానంగా ముందుకు నడిచాడు. అతనికి అతీ చేరువలోనే రహస్యమీటలున్నాయి. కాని అతని వెన్నుని నొక్కి వున్న రవీంద్ర రివాల్వర్ అతనికి హెచ్చరిక లాగా వెన్ను తట్టుతోంది. గత్యంతరంలేక గోడలో వున్న ఓ మీటను చూపించాడు.

ఉజ్వల ఆటంని మీట నొక్కకుండా ఆపి, "ఆ విషయం మేం చూసుకుంటాం. నువ్వు అలాగే నిల్చో!" అన్నది.

ఆటం ఆగిపోయాడు.

ఉజ్వలమీట పక్కనున్న యిండికేటర్ చూసింది. పైన ఏవైనా బోను తాలూకు చిహ్నాలున్నాయేమో పరిశీలించి, సంతృప్తిచెందాక మీట నొక్కింది.

ఆటం మోసం చెయ్యలేదు. నిజం మీటనే చూపించాడు.

"హుర్రియవ్!" అన్నది ఉజ్వల.

అందరు బిలబిలమంటూ ఆ ద్వారం లోపల్నించి బయటికి పరుగెత్తారు. అది దేగలకొండకి చేర్చి వున్న రహస్య బిలం తాలూకు బండరాయి.

చివరగా రవీంద్ర, ఉజ్వల బయటికి అడుగుపెట్టుండగానే లోపల్నుంచి పెద్ద విస్ఫోటం! చాలా పెద్ద పేలుడు ఒకేసారి సంభవించగానే దేగల కొండప్రాంతమంతా అదిరిపోయింది. బండలు గులకరాళ్ళలా లేచిపోయాయి. కొద్దిక్షణాల్లోనే రహస్య స్థావరమంతా బూడిదయిపోయింది.

—:అయిపోయింది:—